www.peoplesnews.in

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 49 శనివారం, జూలై 04, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




# బిఆర్ఎస్ అప్పులు అక్షరాలా

# రూ. 8,21,651 కోట్లు

## - అనేక సంస్థలకు వేలకోట్ల బకాయిలు పెట్టిన ఘనులు

- చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు డ్రామాలు
- నాటి అప్పులు, తప్పులపై కెసిఆర్ స్పందించాలి
- హరీష్ రావు అబద్దాలను కట్టిపెడితే మంచిది
- డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క స్ట్రాంగ్ వార్నింగ్



**హైదరాబాద్,జూలై 3 :** గత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేసిన భారీ అప్పులు, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రస్తుతం లేనిపోని అబద్దాలను ప్రచారం చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన తప్పులను తక్కువ చేసి చూపించేందుకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారని భట్టి విక్రమార్క అన్నారు. మంత్రిగా పనిచేసిన విషయాన్ని మరిచిపోయి హరీశ్ మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై స్పష్టమైన లెక్కలను బయటపెట్టిన ఆయన.. గత పాలకులు రాష్ట్రంపై సుమారు రూ. 8,21,651 కోట్ల అప్పులు , బకాయిల భారాన్ని మిగిల్చారని, వాటిని ప్రస్తుత ప్రభుత్వం ఎంతో శ్రమతో క్రమబద్ధీకరిస్తోందని వెల్లడించారు. అలాగే రెసిడెన్షియల్ పాఠశాలల్లోని పిల్లలకు నాణ్యమైన భోజనం, బట్టలు , కనీస సౌకర్యాలను కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తమ ప్రభుత్వం వచ్చాకే విద్యా సంస్థల్లోని వసతులను మెరుగుపరిచి సంక్షేమానికి పెద్దపీట వేసిందని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను డిప్యూటీ సీఎం తీవ్రంగా ఖండించారు. బొగ్గు గనుల కేటాయింపులు, ఉత్పత్తికి సంబంధించి మిగతా2లో...

# అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు

- యాత్రలో పాల్గొనడం గొప్ప అనుభూతిగా వెల్లడి
- యాత్రలో జాగ్రత్తలు పాటించాలంటూ ఎక్స్ వేదికగా పిలుపు



**న్యూఢిల్లీ,జూలై 3 :** అమర్ నాథ్ యాత్రను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ భక్తులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర యాత్రను ఒక 'గొప్ప భాగ్యం'గా అభివర్ణించిన ప్రధాని, భక్తి శ్రద్ధలతో, క్రమశిక్షణతో, బాధ్యతాయుతమైన జాతీయ భావనతో భక్తులు ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు. శివభక్తులను ఉద్దేశించి రాసిన లేఖను ఎక్స్ వేదికగా పంచుకుంటూ మోదీ పలు కీలక విషయాలను ప్రస్తావించారు.'పవిత్రమైన అమర్‌నాథ్ యాత్రలో పాల్గొనడం ఒక గొప్ప భాగ్యం. ప్రతి సంవత్సరం మంచు లింగంని నేరుగా మిగతా2లో...

# కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల నటన అద్భుతం

## - కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా



**హైదరాబాద్,జూలై 3 :** కాంగ్రెస్, భారాస నేతల నటన అద్భుతంగా ఉందని, బిగ్‌బాస్ షోను తలపిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ప్రజలు మీ నాటకాలు చూసి నవ్వుకుంటున్నారు. అబద్దాలకు ఆస్కార్ అవార్డు ఇస్తే రెండు పార్టీలూ అర్హత సాధిస్తాయని అన్నారు. మిగతా2లో...

# అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు

## - హెచ్చరించిన వాతావరణ శాఖ



**విశాఖపట్టణం,జూలై 3 :** ఉత్తర, పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

మిగతా2లో...

# బిఆర్ఎస్ హయాం అప్పులపై తప్పుడు ప్రచారం

- తొమ్మిదిన్నరేళ్లలో తీసుకున్న రుణాలు రూ.4.17 లక్షల కోట్లే
- మంత్రి జూపల్లికు హరీష్ రావు లేఖ



**హైదరాబాద్,జూలై 3 :** బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు... ఈ మేరకు మంత్రి జూపల్లి కృష్ణారావుకు బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో చేసిన ప్రసంగాల వీడియోలు, ఆర్బీఐ గణాంకాలు సహా పలు ఆధారాలను మంత్రి జూపల్లి వాట్సాప్‌కు పంపినట్లు వెల్లడించారు. హరీశ్‌రావు లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం.. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ల పాలనలో తీసుకున్న రుణాలు, ప్రభుత్వ హామీతో మిగతా2లో...

# రండి అప్పులు సంగతి తేలుస్తా...

- అబద్దాలతో ప్రజలను మభ్య పెట్టలేరు
- మరోమారు హరీష్ రావుకు జూపల్లి సవాల్




**హైదరాబాద్,జూలై 3 :** తెలంగాణ అప్పులపై మంత్రి జూపల్లి కృష్ణారావు చర్చకు మరోమారు సిద్ధమయ్యారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు సిద్ధమని.. సాయంత్రం 5 గంటలకు వస్తానని బీఆర్ఎస్ నేతలకు మరోసారి సవాల్ విసిరారు. 'మీరు సిద్ధమైతే ముందే చెప్పండి. నా లెక్కలు తప్పు అయితే రాజీనామా చేస్తా. మీ లెక్కలు తప్పు అయితే రాజీనామా చేస్తారా? బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? కేసీఆర్ రాకపోతే జూపల్లి చెప్తున్న లెక్కలు తప్పని మీడియాతో చెప్పమనండి. ఖబడ్దార్.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్.. పాలమూరు పౌరుషమా? కల్వకుంట్ల పౌరుషమా చూసుకుందాం' అంటూ ఛాలెంజ్ చేశారు. 'నేనెక్కడికీ పారిపోలేదు. పారిపోయే లక్షణం నాకు లేదు. నా మాటకు కట్టుబడి ఉన్నాను. ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ డెడ్‌లాగా కేటీఆర్, హరీశ్ వ్యవహరిస్తున్నారు.

మిగతా2లో...

# రైతుభరోసా నిధుల విడుదల

## నాలుగు రోజుల్లో రూ.6,590.37 కోట్ల జమ



**హైదరాబాద్,జూలై 3 :** రైతు భరోసా పథకం అమలులో తెలంగాణ ప్రభుత్వం వేగం పెంచింది. కేవలం నాలుగు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.6,590.37 కోట్ల రైతు భరోసా నిధులను జమ చేసి రికార్డు సృష్టించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. నేడు నాలుగో విడతలో 4 నుంచి 5 ఎకరాల భూమి ఉన్న రైతులకు రూ.1,188 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేసింది. ఈ విడతలో

మిగతా2లో...

# రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణం

- ఈ జూలై నెలలో 10 ప్యాకేజీల పనులు ప్రారంభం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు: ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్,జూలై 3 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో 'న భూతో న భవిష్యతి' రీతిలో రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణానికి సంకల్పించామని,అందులో భాగంగా జూన్ 28న నల్లగొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర హ్యామ్ రోడ్ల పనుల పైలాన్ ఆవిష్కరణ చేసుకుని,పనులు ప్రారంభించామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. మిగతా2లో...

# మంత్రి కొండా సురేఖతో పిసిసిఎఫ్ వినయ్ కుమార్ భేటీ

- అటవీ సంపద పరిరక్షణ, పచ్చదనంపై కార్యాచరణ
- ను అమలు చేయాలని నూతన పిసిసిఎఫ్ కు దిశానిర్దేశర
- మాజీ పిసిసిఎఫ్ సువర్ణను చీరతో సత్కరించిన మంత్రి

**హైదరాబాద్,జూలై 3 :** రాష్ట్ర అటవీదళాల నూతన ప్రధాన సంరక్షణాధికారి (పిసిసిఎఫ్)గా బాధ్యతలు స్వీకరించిన వినయ్ కుమార్ శుక్రవారం అటవీ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖను జూబ్లిహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అటవీ సంపద పరిరక్షణ, అటవీ విస్తీర్ణం పెంపు, జీవ వైవిధ్య సంరక్షణ, సామాజిక అటవీ కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిగతా2లో...



# అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

దర్శించుకునే ఈ అవకాశం లక్షలాది మంది శివభక్తులకు అత్యంత పవిత్రమైన, మరపురాని అనుభూతిని ఇస్తుంది. ఈ సంవత్సరం యాత్రకు సిద్ధమవుతున్న భక్తులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ యాత్ర భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక శాశ్వతమైన అధ్యాయమని ప్రధాని కొనియాడారు. ప్రపంచ వ్యాప్తంగా సనాతన సంస్కృతిని అనుసరించే లక్షలాది మంది భక్తులు ప్రతి ఏటా బాబా అమర్‌నాథ్ ఆశీస్సుల కోసం జమ్మూ కశ్మీర్‌కు వస్తుంటారని గుర్తుచేశారు. వివిధ ప్రాంతాలు, విభిన్న భాషలు, భిన్నమైన ఆచారాలు ఉన్నప్పటికీ.. మహాదేవుని ఆశీస్సులు పొందాలనే ఒకే ఒక సంకల్పంతో భక్తులంతా ఇక్కడికి తరలివస్తారని, ఈ రెండు నెలల కాలంలో బాబా బర్ఫానీ పవిత్ర సన్నిధిలో భారతదేశ 'భిన్నత్వంలో ఏకత్వం' అనే అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుందని మోదీ అన్నారు. ఈ యాత్ర సజావుగా సాగడానికి అహర్నిశలు శ్రమిస్తున్న భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూ కశ్మీర్ పోలీస్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు ఆరోగ్య కార్యకర్తలు, పరిపాలనా అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు, వాలంటీర్లకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది యాత్ర సందర్భంగా భక్తులందరూ తమ జీవితంలో ఐదు ముఖ్యమైన సంకల్పాలను స్వీకరించాలని ప్రధాని పిలుపునిచ్చారు. అమర్‌నాథ్ యాత్ర మార్గంలో ఎక్కడా చెత్తాచెదారం వేయకుండా, పరిశుభ్రత నియమాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. వాతావరణ మార్పులు, వర్షాల నేపథ్యంలో జారే మార్గాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, పరిపాలనా యంత్రాంగం ఇచ్చే ఆదేశాలను, ట్రాఫిక్ నిబంధనలను, భద్రతా సూచనలను పూర్తిగా అంకితభావంతో పాటించాలని సూచించారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, యాత్రికులు తమ ప్రయాణ ఖర్చులలో కనీసం 10 శాతం మొత్తాన్ని జమ్మూ కశ్మీర్‌లోని స్థానిక ఉత్పత్తులను కొనుగోలుకు కేటాయించాలి. ఇది అక్కడి కుటుంబాలకు, యువతకు ఉపాధినిస్తుందన్నారు. రక్షాబంధన్ పండుగతో ముగిసే ఈ యాత్ర ముగింపు సందర్భంగా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' అమ్మ పేరిట ఒక మొక్క ప్రచారంలో భాగంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలన్నారు. దేశమే ప్రథమమనే భావనతో, మన బాధ్యతలను ఏడాది పొడవునా నిజాయితీగా నిర్వర్తిస్తూ, 'వికసిత్ భారత్' నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించాలి. చివరగా, భక్తులందరి ప్రయాణం సుఖమయంగా, సురక్షితంగా, ఆధ్యాత్మికంగా సాగాలని ప్రధాని ఆకాంక్షించారు.

# బిఆర్ఎస్ అప్పులు అక్షరాలా రూ. 8,21,651 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించి సంస్థను నష్టాల్లోకి నెట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం సింగరేణిని కాపాడుకోవడానికి అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని వివరించారు. సింగరేణిలో జరిగిన గత ప్రభుత్వ కాలపు అక్రమ వ్యవహారాలపై తాము విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తున్నట్లు ఈ సందర్భంగా భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో, బయటా అబద్ధపు ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించిన ఆయన, దమ్ముంటే తమతో నేరుగా బహిరంగ చర్చకు రావాలంటూ మాజీ సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరారు. బీఆర్ఎస్ పాలనలో చేసిన అప్పులపై కేసీఆర్ స్పందించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో మొత్తం అప్పు రూ. 8.21 లక్షల కోట్లు అని.. మొత్తం అప్పుల్లో గత ప్రభుత్వ బకాయిలు ఉన్నాయని తెలిపారు. అప్పులు అన్నీ వాస్తవాలు కాదా.. వీటిని ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పులను తక్కువ చేసి చూపేందుకే కేటీఆర్, హరీశ్ ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి మండిపడ్డారు. మంత్రిగా పనిచేశానని మర్చిపోయి మరీ హరీశ్ మాట్లాడుతున్నారని.. అనేక అంశాలపై అబద్దాలు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తేవాలన్నారు. బీఆర్ఎస్ నేతల అబద్దాలు ప్రజల్లోకి వెళ్లకూడదన్నారు. సోషల్ మీడియా ద్వారా అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్దాల పునాదులపై పదేళ్లు పరిపాలించారని.. బీఆర్ఎస్ చేసిన అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విరుచుకుపడ్డారు. అప్పుల భారం రాష్ట్రంపై వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు అనేక విషయాలపై అబద్దాలు చెబుతున్నారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తీసుకురావాలి. బీఆర్ఎస్ నేతలు చెప్పే అవాస్తవాలు ప్రజల్లోకి వెళ్లకూడదు. సోషల్ మీడియా వ్యవస్థల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. అబద్దాల పునాదులపై పదేళ్లపాటు పరిపాలన చేశారు. బీఆర్ఎస్ నేతలు కావాలనే ప్రభుత్వంపై పదేపదే దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ పార్టీ హయాంలో చేసిన అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్‌కు సవాల్ విసురుతున్నాం. 2014 నుంచి 2023 వరకు అప్పులు చేసి రాష్ట్రంపై పెనుభారం వేసింది నిజం కాదా? వివిధ మార్గాల ద్వారా మీరు చేసిన అప్పు రూ. 8.21లక్షల కోట్లు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారు?అప్పుల అంశంపై నిత్యం మాట్లాడితే రాష్ట్రం పరువు పోతుందని తగ్గాం. మేం వచ్చాక రూ. 2.08లక్షల కోట్లు చెల్లించాం. 10 శాతం వడ్డీకి కూడా మీరు అప్పులు తెచ్చారు. కట్టాల్సిన వడ్డీని రూ. 34 వేల కోట్ల నుంచి రూ. 11వేల కోట్లకు తగ్గించాం. బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. సింగరేణిపై ప్రతిరోజూ అబద్దాలు చెబుతున్నారు' అని భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో ఏ మూలన చూసిన నాణ్యమైన ఆర్ అండ్ బి డబుల్ రోడ్లు వినియోగంలోకి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. 'మంచి రోడ్డు - ప్రగతికి సూచిక' అని తాను బలంగా విశ్వసిస్తానని, దీంతో పల్లె పట్టణాలకు కనెక్టివిటీ పెరిగి,గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తె స్థానికంగానే ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు పనుల పురోగతిపై డా.బి.ఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆ శాఖ ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్ అండ్ బి లోని విభాగాల వారీగా పనుల పురోగతిపై కూలంకషంగా చర్చించిన మంత్రి,చేపట్టిన కీలక పనులు ఏ దశల్లో ఉన్నాయో అధికారులను ఆరాతీశారు. మొదటి ఫేజ్ లో సుమారు 13వేల కోట్లతో 6092 కి.మీ రోడ్ల పనులు 34 ప్యాకేజీల్లో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనుండగా..ఈ జూలై నెలలోనే 10 ప్యాకేజీల పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్యాకేజ్-2లో సుమారు 155 కోట్ల అంచనా వ్యయంతో 42కి.మీ పొడవుగల నల్లగొండ-మహబూబ్ నగర్ డబుల్ రోడ్డు పనులు ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు ఆశించిన స్థాయిలో లేవని,అయినా.. వర్షాకాలం పూర్తి అయిన తర్వాత మూడు షిఫ్టుల్లో రోడ్ల నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణం కోసం నిష్ణాతులై, నిరంతరం ఫీల్డ్ లో ఉండే ఇంజనీర్లను ఎంపిక చేసి,ప్యాకేజీల వారిగా పనుల బాధ్యతలు అప్పజెప్పాలని,పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయించడం చీఫ్ ఇంజనీర్ల బాధ్యతేనని మంత్రి స్పష్టం చేశారు. ఈనెల 6న కరీంనగర్ జిల్లాలో చేపట్టే హ్యామ్, రోడ్ల పనులకు ఆ జిల్లా మంత్రులు,స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అందుకు సంబంధిత ఏర్పాట్లు చూడాలని సి.ఈ లు బి.వి రావు,వసంత్ నాయక్ లను మంత్రి ప్రత్యేకంగా ఆదేశించారు. రాజేంద్ర నగర్ లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన హై కోర్టు భవనం,జడ్జిల నివాస సముదాయ భవనాల నిర్మాణాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని,నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరగాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 16 శాతం పనులు పూర్తయ్యాయని సి.ఈ లు రాజేశ్వర్ రెడ్డి, నర్సింగ్ రావు వివరించగా....మూడు షిఫ్టుల్లో నిర్మాణ పనులు జరగాలని,అందుకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచి, నిర్మాణ సంస్థతో సమన్వయం చేసుకుంటూ పనుల్లో వేగం పెంచాలని మంత్రి వారిని ఆదేశించారు. అక్కడ ఆర్ అండ్ బి తరుపున నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్న ఇంజనీర్ల సంఖ్యను పెంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 డిసెంబర్ నాటికి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

# మంత్రి కొండా సురేఖతో పిసిసిఎఫ్ వినయ్ కుమార్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించడం, ప్రభుత్వ లక్ష్యాలు, అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, తదితర అంశాలపై వీరిరువురు సమగ్రంగా చర్చించారు. అటవీ సంపదను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సురేఖ పిసిసిఎఫ్ కు సూచించారు. అటవీ శాఖ కార్యక్రమాల అమలులో సాంకేతికత వినియోగం, అటవీ రక్షణ చర్యల బలోపేతం, పచ్చదనం పెంపుదల, అటవీ అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణను మరింత వేగవంతం చేయాలని మంత్రి వినయ్ కుమార్ కు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అటవీ శాఖ పూర్తి నిబద్ధతతో పనిచేస్తుందని పీసీసీఎఫ్ వినయ్ కుమార్ ఈ సందర్భంగా మంత్రికి హామీ ఇచ్చారు. అడవుల సంరక్షణకు అహర్నిశలు కృషి చేస్తూ, అటవీ సంపదను కాపాడుతున్న అటవీ అధికారులు, సిబ్బందికి ప్రతి ఏటా అవార్డులు, నగదు ప్రోత్సహకాలు అందించేలా చర్యలు చేపట్టినందుకు గాను పిసిసిఎఫ్ వినయ్ కుమార్ మంత్రి సురేఖ గారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ అటవీ రంగంలో ఈ చర్య మైలురాయిగా నిలుస్తుందని, అటవీ సిబ్బంది సేవలకు ప్రభుత్వం ఇస్తున్న గౌరవానికి ఇది నిదర్శనమని ఆయన అన్నారు. పదవీ విరమణ తర్వాత తనను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ పిసిసిఎఫ్ సువర్ణను మంత్రి కొండా సురేఖ చీరతో సత్కరించి, అభినందించారు. అటవీ శాఖకు ఆమె అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. పదవీవిరమానంతర జీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.

# అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్ష కురిసే అవకాశం ఉందని, దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో తేలిక నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. వాయవ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రాబోయే రెండు, మూడు రోజుల్లో మరింత బలపడే అవకాశం ఉందన్నారు. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం మేఘావృతమైన వాతావరణంతో శ్రీకాకుళం, పోలవరం, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. 40 మంది మృతి

**ఇస్లామాబాద్,జూలై 3 :**పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు.. లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 40 మంది ప్రయాణికులు మరణించారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. పాకిస్థాన్ బలూచిస్థాన్ రాష్ట్రంలో షేరానీ జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న షేరానీ జిల్లా ఉన్నతాధికారులు, వైద్యులు, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను అత్యవసర చికిత్స కోసం ఝోబ్‌లోని ట్రామా సెంటర్‌కు తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇటీవల జరిగిన అత్యంత ఘోర రోడ్డు ప్రమాదాల్లో ఇదీ కూడా ఒకటని అధికారులు తెలిపారు. సాంకేతిక లోపంతో ఓ బస్సు ఆగిపోయిందని, దీంతో అందులోని ప్రయాణికులను కూడా ఈ బస్సులోకి ఎక్కించారని అధికారులు చెప్పారు. దీంతో బస్సు ప్రయాణికులతో నిండిపోయిందన్నారు. ఈ ప్రమాదం జరిగిన బస్సు.. 36 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి బయలుదేరిందని పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభమైందని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల నటన అద్భుతం

(మొదటి పేజీ తరువాయి)

గురుకులాల టెండర్లు, తెలంగాణ అప్పులతోపాటు అవినీతి, అక్రమాలపైనా చర్చిద్దాం రండి. మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆధ్వర్యంలో తేదీ, సమయం, వేదిక నిర్ణయిస్తాం. కాంగ్రెస్, భారాస పాలనా వైఫల్యాలను ప్రజల ముందుంచేందుకు మేం సిద్ధం. మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి ఖర్చు చేసిన నిధులు, అందించిన సంక్షేమ కార్యక్రమాలపైనా చర్చిద్దాం. తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని సంజయ్ అన్నారు.

# బిఆర్ఎస్ హయాం అప్పులపై తప్పుడు ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్న రుణాలు కలిపి మొత్తం రూ. 4.17 లక్షల కోట్లేనని అసెంబ్లీలో వివరించినట్లు తెలిపారు. ఆ లెక్కలపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని అప్పుడే ప్రకటించానని గుర్తు చేశారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ నుంచి 2026 జూన్ వరకు రూ. 1,77,058 కోట్ల అప్పు చేసినట్లు మంత్రి జూపల్లి తన లేఖలో పేర్కొన్నారని తెలిపారు. అయితే, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం 2026 జూన్ 30 నాటికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పు రూ. 1,86,067 కోట్లుగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. మరోవైపు, 2026 మార్చి 18న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రభుత్వం చేసిన ఎఫ్ఆర్‌బీఎం, ఇతర అన్ని రకాల రుణాలు కలిపి రూ. 3,47,294 కోట్లుగా ప్రకటించారని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ తమ లెక్కలను మార్చడం లేదని, కాంగ్రెస్ మాత్రం సందర్భానుసారంగా అప్పుల అంకెలను మారుస్తోందని విమర్శించారు. తమ అంచనాల ప్రకారం వివిధ మార్గాల ద్వారా ప్రస్తుత ప్రభుత్వం సుమారు రూ. 4.5 లక్షల కోట్ల అప్పులు చేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ అంశానికి సంబంధించిన అసెంబ్లీ వీడియోలు, ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలు, ఆర్బీఐ అధికారిక గణాంకాలను మంత్రి జూపల్లి వాట్సాప్‌కు పంపినట్లు తెలిపారు. వాటిని పరిశీలించి వాస్తవాలను తెలుసుకోవాలని కోరిన హరీశ్ రావు,అప్పుల అంశంలో తప్పుడు ప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు.

# రండి అప్పులు సంగతి తేలుస్తా...

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర అప్పు రూ. 3,17,015 కోట్ల అని ఒకసారి, రూ. 3,85,045 కోట్లు అని మరోసారి అసెంబ్లీలో కేటీఆర్ అన్నారు. రాష్ట్ర అప్పు రూ. 4, 26,499 కోట్లు అని ఒకసారి.. రూ. 4,17, 496 కోట్లు అని మరోసారి హరీశ్ అసెంబ్లీలో అన్నారు. కేసీఆర్ దిగిపోయే సరికి రూ. 8,21, 651 కోట్ల అప్పు ఉంది. నేను చెప్తున్న లెక్కలు తప్పు అయితే మంత్రి పదవికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని తాజాగా సవాల్ చేశారు. కార్పొరేషన్ ద్వారా తెచ్చిన అప్పులను కేటీఆర్, హరీశ్ ఎందుకు చెప్పడం లేదు. మిషన్ భగీరథ కోసం తెచ్చిన అప్పులు ప్రజలు కడతారా?' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అబద్దాలు చెప్పే వాడిని కాదని మంత్రి తెలిపారు. ఆత్మ గౌరవం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేశానని గుర్తుచేశారు. ఉద్యోగానికి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకునే వాడినని తెలిపారు. రాజకీయాల నుంచి వ్యాపారంలోకి రాలేదని.. వ్యాపారం చేసి రాజకీయాల్లోకి వచ్చినట్లు జూపల్లి కృష్ణారావు వెల్లడించారు.

# రైతుభరోసా నిధుల విడుదల

(మొదటి పేజీ తరువాయి)

4.41 లక్షల మంది రైతులు లబ్ది పొందినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటివరకు మొత్తం 65.76 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా సాయం జమ చేసినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన అర్హులైన రైతులకు కూడా దశలవారీగా నిధులు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతు

# ఉస్మానియా వైద్యుల అరుదైన చికిత్స

## అవయవ మార్పిడిలో రికార్డు సృష్టి

## వైద్యులను సన్మానించిన మంత్రి దామోదర

**హైదరాబాద్,జూలై 3 :** నగరంలోని ఉస్మానియా ఆస్పత్రిలో 5 అవయవాల మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. దీంతో వైద్యులను వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర నరసింహ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణ రాష్ట్ర వైద్య రంగంలో సరికొత్త అధ్యాయం లిఖించబడింది. దేశ వైద్య చరిత్రలోనే అత్యంత అరుదైన ఘనతను ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి సొంతం చేసుకుంది. అవయవదానం అనేది మహాదానం, ఈ సందేశాన్ని సమాజంలోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.' అని అన్నారు. ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రిలో తొలిసారిగా 5 అవయవాల మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు అత్యంత విజయవంతంగా పూర్తి చేశారు. సుమారు 36 గంటల పాటు ఎంతో క్లిష్టంగా సాగిన ఈ శస్త్రచికిత్సను విజయవంతం చేసిన డాక్టర్ మధుసూదన్ నేతృత్వంలోని వైద్య బృందాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యుల ప్రతిభను, వారి



అంకితభావాన్ని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. అవయవదానం అనేది మహాదానమని, ఈ సందేశాన్ని సమాజంలోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం గట్టి సంకల్పంతో పనిచేస్తోందని మంత్రి దామోదర స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే వైద్య రంగ బలోపేతానికి పెద్దపీట వేస్తూ గత రెండున్నరేళ్ల కాలంలోనే 15 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని వెల్లడించారు. అంతేకాకుండా, తాజాగా మరో 6,238 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలను నిరంతరం విస్తరిస్తున్నామని, ఉస్మానియా వైద్యుల ఘనతతో తెలంగాణ వైద్య రంగానికి జాతీయ స్థాయిలో గొప్ప గుర్తింపు లభించిందని మంత్రి దామోదర్ రాజనర్సింహ హర్షం వ్యక్తం చేశారు.

# వానల కోసం దేవతలకు జలాభిషేకం చేసిన మహిళలు





**చిట్యాల ప్రతినిధి జూలై 3 (పీపుల్స్ న్యూస్)**
ఈ వానాకాలంలో వానలను దండిగా కురిపించాలని వేడుకుంటూ చిట్యాల మండల కేంద్రం లోని చింతలపల్లి గ్రామంలో శుక్రవారం మహిళలంతా పోచమ్మ తల్లి దేవతకి పెద్దమ్మ తల్లి దేవతకి జలాభిషేకం చేశారు. నెల రోజులు కాలం పోయినా నేటి వరకు వర్షాలు లేకపోవడంతో పంట చేలలో విత్తనాలు మొలకెత్తిలేని దుస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఒక్కటి కూడా గట్టి వాన పడకపోవడంతో పొడి నేలలో వేసిన విత్తనాలు మొలకెత్తకుండానే మాడిపోతున్నాయని బోర్ల ద్వారా నీటిని అందించాలని ప్రయత్నం చేసినప్పటికీ భూగర్భ జలాలు అడుగట్టుకోవడంతో బోర్లు మొరాయిస్తున్నాయని చెరువులు కుంటలు ఎప్పుడో ఎండిపోయాయని నీటి చుక్క దొరకక పంటలు పండే పరిస్థితి లేదని దేవతలు కరుణించి వానలు సమృద్ధిగా కురిసేలా పంటలు పండేలా దీవించాలని మహిళలంతా వేడుకున్నారు.

# జులై 07వ తేదీన మాదిగల ఆత్మగౌరవ ప్రతీక అయిన ఎమ్మార్పీఎస్ దండోరా జెండాలు పల్లె పల్లెలో, బస్తి బస్తీలో, రెపరెపలాడాలి .

**-వంగూరి ఆనందరావు మాదిగ ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ జాతీయ నాయకులు వరంగల్ జిల్లా ఇన్చార్జి**




**వరంగల్ /ఖమ్మం /జులై 03/(పీపుల్స్ న్యూస్**
జులై 7వ తేదీన మాదిగల ఆత్మగౌరవ పతాకమైన ఎమ్మార్పీఎస్ దండోరా జెండాలను ప్రతి మాదిగ బస్తీలో మాదిగ పల్లెలో ఒక పండగ వాతావరణాన్ని తలపించే విధంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని ఆనందరావు మాదిగ పిలుపునిచ్చినారు ఎమ్మార్పీఎస్ ఉద్యమ లక్ష్యసాధన ఏ.బి.సి.డి.లో సాధన అయినప్పటికీ సమాజంలోని సకలజనుల సమస్యల సాధన కోసం ఎమ్మార్పీఎస్ ఉద్యమ అధినేత పద్మశ్రీ అవార్డు గ్రహీత మాల మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో అనేక సామాజి ఉద్యమాలు నిర్మించి ఆ ఉద్యమాల ద్వారా అనేక పథకాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో సాధించి ఈ సమాజానికి అందించిన ఘన చరిత్ర మందకృష్ణ మాదిగ కు ఎమ్మార్పీఎస్ దక్కుతుందని ఆయన ఈ సందర్భంగా తెలియజేసినారు ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత సాధన అనేది ఆషామాషీగా వచ్చింది కాదని ఈ ఉద్యమ లక్ష్యసాధనలో మాదిగ విద్యార్థులు ఉద్యమకారులు జైల్లో పాలు కావటమే కాకుండా అనేక నిర్బంధాలను ఎదుర్కోవటం ఎన్నో ధర్నాలు జైలు నిర్బంధాలు చవిచూసి చివరకు ప్రాణ త్యాగాలు కు కూడా లెక్క వారి ప్రాణాలను అర్పించడం ద్వారానే ఏ ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత సాధన అనేది జరిగిందని ఆనందరావు మాదిగ స్పష్టం చేసినారు వృద్ధుల వితంతుల సమస్యల సాధన కోసం ఆనాడు 200 ఉన్న పింఛన్లు ఈనాడు 2000గా సాధించుకోవటం అదేవిధంగా ఒకనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పేద కుటుంబాల నుండి చిన్న పిల్లలకు గుండెకు జబ్బులు వస్తే ఆ జబ్బులను నయం చేయించుకోవడానికి స్తోమత లేని కుటుంబాలు కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు చేయించుకోలేని దీన స్థితిలో ఉన్న ఆ కుటుంబాల పిల్లలను ఆదుకునే విధంగా ప్రభుత్వమే ప్రత్యేక పథకాలను పెట్టి అట్లాంటి సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించి ఆనాడు రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో గుండె జబ్బుల చిన్నారుల ఉచిత ఆపరేషన్ల పథకాన్ని మందకృష్ణ మాదిగ నాయకత్వంలో బలమైన ఉద్యమాలు నిర్వహించి సాధించటం జరిగిందని ఆ ఉచిత ఆపరేషన్ల పథకమే నేడు ఆరోగ్యశ్రీ గా మారిందని ఆయన ఈ సందర్భంగా తెలియజేసినారు అంతేకాకుండా వికలాంగులకు ఆనాడు 200 గా ఉన్న పింఛన్లను24 తెలంగాణ రాష్ట్రంలో 4000 రూపాయలు ఆంధ్ర రాష్ట్రంలో 6000 రూపాయలుగా పొందటానికి కారణం ఎంఆర్పిఎస్ అధినేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో నిర్వహించిన పోరాటాలే నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నయని స్పష్టం చేసారు ఇట్లా చెప్పుకుంటూ పోతే ప్రియాంక రెడ్డి చనిపోయిన సందర్భంలో అగ్రకులాల ఆడ పిల్లల కు అన్యాయం జరిగితే ఒక న్యాయం అణగారిన వర్గాల ఆడపిల్లలకు అన్యాయం జరిగితే మరొక న్యాయమా అని మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఉద్యమాలు నిర్వహించి ప్రభుత్వాలపై పోరాటాల నిర్వహిస్తే తెలంగాణ రాష్ట్రం మొత్తం 31 జిల్లాల్లో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు రావడం ద్వారా రాష్ట్రంలోనే ఎంతటి వారైనా మహిళల పట్ల హత్యలు అత్యాచారాలకు నేరాలకు పాల్పడితే నిర్దాక్షిణ్యంగా కఠినమైన శిక్షలు అమలు చేయటం ప్రారంభమైందని ఆయన తెలియజేశారు ఇట్లా చెప్పుకుంటూ పోతే సమాజంలో ఏ వర్గానికి అన్యాయం జరిగిన ఎంఆర్పిఎస్ అండగా నిలబడిందని స్పష్టం చేసినారు ఆనాడు మాదిగ డప్పు కొట్టి చెప్పు కుట్టి ఎట్లయితే సమాజానికి సేవ చేసిండొ ఈనాడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో రాష్ట్రంలో దేశంలో అలుపెరగని ఉద్యమాలు నిర్వహించి సమాజంలోని సకల జనులకు అనేక పథకాలు అందించడం జరిగిందని స్పష్టం చేసారు దేశ స్థాయిలో ఎస్సీ ఎస్టీ చట్టాన్ని పరిరక్షించుకోవడంలో గాని అదేవిధంగా దేశంలో అత్యున్నత న్యాయస్థానంలో ఉన్న గవాయిగారికి సుప్రీంకోర్టులో అవమానం జరిగినప్పుడు ఢిల్లీ స్థాయిలో పోరాటాలు చేసి గవాయి గారిని అవమానపరిచిన అహంకార రులు వర్గానికి బలమైన హెచ్చరికలు తెలియజేయడం జరిగింది ఈ సందర్భంగా స్పష్టం చేసినారు ఆనాడు ఎస్సీ వర్గీకరణ అమలను రద్దు పరుస్తూ ఐదుగురు జడ్జీల ధర్మా సన తీర్పును సవాల్ చేస్తూ భారత రాజ్యాంగంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కరు ఎస్సీ జాబితాలోని 59 కులాలకు వెసులుబాటు కల్పించిన 15% రిజర్వేషన్లను 59 కులాల ప్రజల జనాభా దామాషా ప్రకారం దక్కాలనే ప్రధాన డిమాండ్తో ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ ఉద్యమ లక్ష్యానికి అనుగుణంగా భారత ప్రధాన న్యాయమూర్తి గౌరవ చంద్రశూడు గారి ఏడుగురు జడ్జీల ధర్మాసను ఇచ్చిన తీర్పును అనుసరించి నేడు మాదిగ మాదిగ ఒప్పుకులాల ప్రజలకు 9 శాతం రిజర్వేషన్ దక్కటం జరిగిందని ఆయన తెలియజేసినారు భారత భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చొరవతో ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత సాధనను ఏడుగురు జడ్జీల ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి ఉద్యమ లక్ష్యసాధనను పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ గారి నాయకత్వంలో సమాజంలోని 59 కులాలకు సామాజిక న్యాయాన్ని అందించే సమన్యాయాన్ని సాధించుకోవడం జరిగిందని ఈ సందర్భంగా ఆనందరావు మాదిగ తెలియజేసారు అట్లాంటి ఉద్యమ నేపథ్యం గల ఎమ్మార్పీఎస్ కు నేడు జూలై 7వ తేదీ నాటికి 32 సంవత్సరాలు నిండుతున్న శుభ సందర్భంలో దండోరా పథకాలను వాడవాడలా బస్తి బస్తిన పల్లె పల్లెన దండిగా ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు నేడు సుప్రీంకోర్టు ద్వారా గా సాధించుకున్న వర్గీకరణ ఫలాలకు అనుకూలంగా చదువులు కొనసాగించాలని ఈ విద్యా సంవత్సరం నుండి గోటు విలేజ్ కార్యక్రమాన్ని అమలు చేయాలని మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు గత నెల 25వ తేదీ నుండి జూలై 7వ తేదీ నాటికి గో టు విలేజి 40 రోజుల కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ జాతీయ రాష్ట్ర జిల్లా మండల నాయకత్వాలు పల్లె పల్లెనా వాడవాడలా బస్తి బస్తినా మాదిగ మాదిగ ఒప్పుకులాల పిల్లలను వారి తల్లిదండ్రులను సమీకరించి చదువులపై చైతన్య అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని ఈ సందర్భంలో పిల్లల తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రతి విద్యార్థినీ విద్యార్థులను బడిబాట మానకుండా సక్రమంగా బడికిపోయే విధంగా వారి పట్ల శ్రద్ధ వహించాలని వారి తల్లిదండ్రులను కోరినట్లు ఆనందరావు మాదిగ తెలియజేసారు.

# సర్కార్ బడి సూపర్ హిట్ ..నో అడ్మిషన్ బోర్డ్

- -.ప్రభుత్వ స్కూళ్లకు పూర్వవైభవం సీట్లు ఫుల్.
- -.ఆధునిక బోధన పౌష్టికాహారం అడ్మిషన్ల వెల్లువ.
- -.తల్లిదండ్రుల చూపు సర్కార్ బడి వైపు సీట్లు ఖాళీ లేవు
- -.ప్రైవేటుకు పోటీగా ప్రభుత్వ బడి 100% అడ్మిషన్లు.




**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 03 ( పీపుల్స్ న్యూస్)**
గోవిందరావుపేటమండలంలోని కర్లపల్లి ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాలకు ఈసారి ఊహించని డిమాండ్ వచ్చింది. 2026-27 విద్యా సంవత్సరానికి సీట్లన్నీ ఫుల్ కావడంతో యాజమాన్యం 'నో అడ్మిషన్' బోర్డు పెట్టాల్సి వచ్చింది.ప్రధానోపాధ్యాయులు పి.గంగు మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. ఆధునిక బోధనా పద్ధతులు, మంచి పౌష్టికాహారం అందిస్తుండటంతో అడ్మిషన్లు భారీగా పెరిగాయి" అని తెలిపారు.అడ్మిషన్ల కోసం తాము సిబ్బందితో కలిసి గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం మండలాల్లోని గ్రామాల్లో పర్యటించి తల్లిదండ్రులకు ప్రభుత్వ బడుల్లోని సౌకర్యాలను వివరించామని ఆయన చెప్పారు. దీంతో అధిక సంఖ్యలో విద్యార్థులు చేరారన్నారు.పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన తోటి ఉపాధ్యాయ బృందానికి ప్రధానోపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు.

# సర్వాపూర్ లో విద్యుత్ షాక్ తో ఆరు ఆవులు మృతి

- - బాధితులకు 4 లక్షలు బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి
- - సిపిఎం పార్టీ నాయకులు గుండెబోయిన రవిగౌడ్
- - బిక్కినేని కొండల్ రావు





**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 03 (పీపుల్స్ న్యూస్)**(సర్వాపూర్ )ములుగు మండలం లోని సర్వాపూర్ గ్రామానికి చెందిన జాజ రామయ్య.తిరుపతి సమ్మికేసు. భూక్యా లచ్చులు. నర్సింగరావు అనే రైతు లకు చెందిన ఆరు ఆవులు రోజు వారి మేతకు పోయే క్రమంలో సర్వాపూర్ తుమ్మల కుంట శివారు లో బుధవారం ఉదయం మేస్తుండగా కరంట్ పోల్ కు ఉన్నా సపోర్ట్ వైర్ కు విద్యుత్ ప్రవహించడం తో ఆరు ఆవులు అక్కడికక్కడే మృతి చెందటం జరిగింది. వాటివిలువ 4 లక్షలు పైన ఉంటుందని రైతు లు ఆవేదన చెందుతున్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు గుండెబోయిన రవిగౌడ్ బిక్కినేని కొండల్ రావు మాట్లాడుతు. బాధిత రైతు లు దుఃఖం లో మునిగి పోయారని మృతి చెందిన ఆవుల తో నే వ్యవసాయం చేసుకునే కుటుంబాలు అవి మృతి చెందటం తో దిక్కు తోచకుండ ఉన్నారని ఇట్టి విషయం పైన బాధిత రైతులు కరంట్ మరియు పశు వైద్యులకు పిర్యాదు చేయగ వారు కూడ వచ్చి సంఘటనస్థలం కు రావడం జరిగిందని బాధితకుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం నాయకులు గుండెబోయిన రవిగౌడ్ బిక్కినేని కొండల్ రావు లు విద్యుత్ అధికారులకు జిల్లా కలెక్టర్ కి విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ నిధులతో నిర్మించిన అంగన్వాడీ భవనం ప్రారంభానికి నోచుకోలేదు..

**- శిథిలావస్థకు చేరిన భవనం.. గ్రామస్థుల ఆవేదన**



**ములుగు (వెంకటాపురం) ప్రతినిధి జూలై 03( పీపుల్స్ న్యూస్)**
వెంకటాపురం మండలం, పాత్రపురం గ్రామ పంచాయతీ: ప్రభుత్వ నిధులతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన అంగన్వాడీ భవనం ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. కోట్లాది రూపాయలు కాకపోయినా ప్రజల పన్నుల రూపంలో వచ్చిన ప్రభుత్వ నిధులతో నిర్మించిన ఈ భవనం వినియోగంలోకి రాకపోవడంపై గ్రామస్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.7 లక్షల వ్యయంతో నూతన అంగన్వాడీ భవన నిర్మాణానికి ఘనంగా శంకుస్థాపన చేసి పనులు పూర్తి చేశారు. అయితే నిర్మాణం పూర్తయి చాలా కాలం గడిచినా భవనాన్ని అధికారికంగా ప్రారంభించకపోవడంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుబాటులోకి తీసుకురాలేకపోయారు.ప్రస్తుతం భవనం చుట్టూ అడవి మొక్కలు, ముళ్ల పొదలు, గడ్డి విపరీతంగా పెరిగిపోయాయి. సరైన నిర్వహణ లేకపోవడంతో భవనం క్రమంగా శిథిలావస్థకు చేరుకుంటోందని స్థానికులు చెబుతున్నారు. వర్షాకాలంలో భవనం పరిసరాలు పూర్తిగా చెత్తాచెదారంతో నిండిపోతుండటంతో పాములు, విషపురుగులు సంచరించే ప్రమాదం కూడా ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అంగన్వాడీ కేంద్రంలో అందాల్సిన పోషకాహారం, ఆరోగ్య సేవలు, గర్భిణులు మరియు బాలింతలకు నిర్వహించే వైద్య పరీక్షలు, చిన్నారులకు అందించే ప్రాథమిక విద్యా కార్యక్రమాలు తగిన భవనం లేక ఇబ్బందికర పరిస్థితుల్లో కొనసాగుతున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో తాత్కాలిక భవనాల్లో సేవలు అందించడం వల్ల చిన్నారులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మించిన ప్రభుత్వ భవనం ఉపయోగంలోకి రాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఇప్పటికే నిర్మాణ పనులు పూర్తయిన భవనాన్ని వెంటనే ప్రారంభించి అంగన్వాడీ కేంద్రాన్ని అక్కడికి తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి భవన పరిసరాలను వెంటనే శుభ్రపరచడంతో పాటు అవసరమైన మరమ్మతులు చేపట్టి, అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించి చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుబాటు లోకి తీసుకురావాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ నిధులు వృథా కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సౌజన్యని కలిసిన, కందుల మహేశ్



**ఖమ్మం/జులై 03/(పీపుల్స్ న్యూస్)**
ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సౌజన్య గారిని మహేశ్ ఫ్యాన్స్ యూత్ లీడర్ మహేశ్ కలిశారు. ఖమ్మం జిల్లాలో సౌజన్య గారు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని మహేశ్ అన్నారు. సౌజన్య గారుపేదవారికి కూడా ఎంతో సాయం చేశారని మహేశ్ ఫ్యాన్స్ యూత్ లీడర్ మహేశ్ అన్నారు. ఈ కార్యక్రమంలోమహేశ్ ఫ్యాన్స్ యూత్ లీడర్ మహేశ్ తో పాటు పలువురు మహేశ్ ఫ్యాన్స్ పాల్గొన్నారు.

శనివారం,
జూలై 04, 2026

హైదరాబాద్
పీపుల్స్ న్యూస్
దినపత్రిక



# విజయవంతమైన లయన్స్ క్లబ్ ఉచిత కంటి వైద్య శిబిరం



**నారాయణపేట, జులై 3**

నియోజకవర్గ కేంద్రాలను మొత్తం పట్టణంలోని లైన్ భవన్లో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం అధ్యక్షుడు లయన్ సత్యాంజనేయులు అధ్యక్షతన అనుగొండ శ్రీనివాసులు డిస్టిక్ విజన్ ఛైర్మెన్ ఆధ్వర్యంలో రామ్ రెడ్డి లయన్స్ కమిటీ ఆస్పత్రి ఎనుగొండ మహబూబ్నగర్ వారి సహకారంతో విజయవంతమైంది . ఇట్టి శిబిరంల ఆప్తాల మిస్ట్ జ్యోతి ,100 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో 46 మందికి ఉచిత కంటి ఆపరేషన్ కొరకు మహబూబ్నగర్ రామిరెడ్డి లైన్స్ కంటి ఆసుపత్రికి ఉచిత బస్సులో పంపడం జరిగినది. వారికి ఉచిత భోజన వసతి సదుపాయాలతో ఆపరేషన్ చేసి ఉచితంగా బస్సులో మక్తల్ కు తిరిగి పంపించడం జరుగును. ఇట్టి కార్యక్రమంలోసభ్యులు లయన్ అంజన్న ప్రసాద్ కోశాధికారి లయన్ ఎస్ రమేష్ రావు పాస్ట్ రీజన్ చైర్ పర్సన్ లయన్ జి జైపాల్ రెడ్డి డిస్టిక్ చైర్ పర్సన్ లయన్ టి నాగరాజు ప్రెసిడెంట్ ఎలెక్ట్ మరియు లైన్ బి అంబాదాసు రావు కోశాధికారి ఎలక్ట్ పాల్గొనడం జరిగినది.

# ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరి పేరు నమోదయ్యేల బిఎల్ఓ లు కృషి చేయాలి

**:- అంతర్గాం తహసిల్దార్ పడాల వరప్రసాద్**



**రామగుండం,జూలై 3 :-** శుక్రవారం అంతర్గాం తహసిల్దార్ పడాల ప్రసాద్ అంతర్గాం మండలంలోని వివిధ గ్రామాలలో పర్యటించి మండల ఓటర్లకు ప్రత్యేక ఓటర్ సవరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా అంతర్గాం తహసీల్దార్ మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం అత్యంత కీలకమైనదని,బిఎల్ ఒ లు ఇచ్చిన ఓటర్ సవరణ ఫారమ్స్ ను వెంటనే నింపి బిఎల్ఓ కి అందించాలని ఫారంలో ఉన్నటువంటి వాటికి సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే బిఎల్వో లను అడిగి తెలుసుకుని ఫారమ్స్ నింపి వారికి అందించాలని అంతర్గామ్ తహసిల్దార్ పడాల ప్రసాద్ తెలిపారు.ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు ఎంతో విలువైనదని,అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా బిఎల్ఎ,బిఎల్ఓ లు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ప్రతి బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రత్యేక ఓటర్ సవరణ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని, అవసరమైన దరఖాస్తులు నింపడంలో సహకరించాలని తెలిపారు.ఓటరు జాబితాలో పేర్లు లేకపోవడం,తప్పులు ఉండడం,చిరునామా మార్పులు,కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హత కలిగిన ఓటరు జాబితా నుంచి మినహాయించబడకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారం అందించాలని,ప్రత్యేక ఓటర్ సవరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేసుకోవాలని,బిఎల్ఓ లను,ప్రజలను అంతర్గాం తహసిల్దార్ పడాల ప్రసాద్ కోరారు.ఈ కార్యక్రమంలో గిర్ధ వార్ గుంట రమేష్,జిపిఓ మర్రి శంకర్ స్వామి,బిఎల్ఒ లు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అడ్వకేట్ వరలక్ష్మి కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్



**రామగుండం,జులై 3 :-**


న్యాయ సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు అందించాలనే లక్ష్యంతో మహిళా అడ్వకేట్ గడమల్ల వరలక్ష్మి గోదావరిఖని బస్టాండ్ సమీపంలోని నూతన షాపింగ్ కాంప్లెక్స్లో ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ శుక్రవారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ న్యాయవాదులు సమాజంలో న్యాయ పరిరక్షణకు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. అడ్వకేట్ వరలక్ష్మి ప్రజలకు నిబద్ధతతో న్యాయ సేవలు అందిస్తూ వృత్తిలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం అడ్వకేట్ గడమల్ల వరలక్ష్మి మాట్లాడుతూ తన నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని,తనపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా ప్రజలకు సమర్థవంతమైన, పారదర్శకమైన న్యాయ సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మేయర్ మహంకాళి స్వామి,డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,న్యాయవాదులు, వరలక్ష్మి కుటుంబ సభ్యులు,సన్నిహితులు,స్థానిక ప్రముఖులు పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**డివిజనల్ ఇంజనీర్, ములుగు**

**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 03 (పీపుల్స్ న్యూస్)**

వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రజలు, రైతులు మరియు వినియోగదారులు విద్యుత్ భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్), టీజీఎన్పీడీసీఎల్, ములుగుకన్నా రాజు విజ్ఞప్తి చేశారు.ప్రజలు పాటించాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు:తడి చేతులతో మోటార్ స్టార్టర్లను లేదా ఇతర విద్యుత్ పరికరాలను ఆన్/ఆఫ్ చేయరాదు.సర్వీస్ వైర్లకు అతుకులు లేకుండా, నాణ్యమైన వైర్లనే ఉపయోగించాలి. పగిలిన స్విచ్లు, దెబ్బతిన్న ప్లగ్లు వెంటనే మార్చాలి.విద్యుత్ పరికరాలకు మరమ్మతులు చేసే ముందు తప్పనిసరిగా మెయిన్ స్విచ్ను ఆఫ్ చేయాలి.తెగిపోయిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదు. వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి, సమీప సబ్స్టేషన్కు లేదా 1912 టోల్-ఫ్రీ నంబర్కు సమాచారం ఇవ్వాలి.విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు మరియు ట్రాన్స్ఫార్మర్లకు పశువులను కట్టరాదు.ట్రాన్స్ఫార్మర్ వద్ద ఫ్యూజ్లు పోయినప్పుడు సొంతంగా వేయడానికి ప్రయత్నించరాదు. వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా 1912కు సమాచారం ఇవ్వాలిఅడవి జంతువుల నుండి పంటలను కాపాడేందుకు పొలాల కంచెలకు విద్యుత్ ప్రవహింపజేయరాదు.



పత్రికా ప్రకటన

విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి – డివిజనల్ ఇంజనీర్, ములుగు

వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రజలు, రైతులు మరియు వినియోగదారులు విద్యుత్ భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్), టీజీఎన్పీడీసీఎల్, ములుగుకన్నా రాజు విజ్ఞప్తి చేశారు.

ప్రజలు పాటించాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు:

- తడి చేతులతో మోటార్ స్టార్టర్లను లేదా ఇతర విద్యుత్ పరికరాలను ఆన్/ఆఫ్ చేయరాదు.
- సర్వీస్ వైర్లకు అతుకులు లేకుండా, నాణ్యమైన వైర్లనే ఉపయోగించాలి. పగిలిన స్విచ్లు, దెబ్బతిన్న ప్లగ్లు వెంటనే మార్చాలి.
- విద్యుత్ పరికరాలకు మరమ్మతులు చేసే ముందు తప్పనిసరిగా మెయిన్ స్విచ్ను ఆఫ్ చేయాలి.
- తెగిపోయిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదు. వెంటనే సంబంధిత విద్యుత్ సిబ్బందికి, సమీప సబ్స్టేషన్కు లేదా 1912 టోల్-ఫ్రీ నంబర్కు సమాచారం ఇవ్వాలి.
- విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు మరియు ట్రాన్స్ఫార్మర్లకు పశువులను కట్టరాదు.
- ట్రాన్స్ఫార్మర్ వద్ద ఫ్యూజ్లు పోయినప్పుడు సొంతంగా వేయడానికి ప్రయత్నించరాదు. వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి లేదా 1912కు సమాచారం ఇవ్వాలి.
- అడవి జంతువుల నుండి పంటలను కాపాడేందుకు పొలాల కంచెలకు విద్యుత్ ప్రవహింపజేయరాదు. ఇది ప్రాణాపాయం కలిగించడమే కాకుండా చట్టరీత్యా నేరం.
- ఎలక్ట్రికల్ లైన్ల కింద బోర్లు వేయరాదు. బోరు మోటార్లను మరమ్మతుల కోసం పైకి తీసేటప్పుడు సమీప విద్యుత్ లైన్లకు తగలకుండా అత్యంత జాగ్రత్త వహించాలి.
- తడి బట్టలు ఆరబెట్టేందుకు ఇనుప రాడ్లు లేదా ఇనుప దండాలు ఉపయోగించరాదు. ప్లాస్టిక్ తాడులను మాత్రమే ఉపయోగించాలి.
- విద్యుత్ ప్రవాహాన్ని ఉపయోగించి చేపలు పట్టరాదు. ఇది ప్రాణాపాయంతో పాటు చట్టరీత్యా నేరం.
- చెడిపోయిన విద్యుత్ పరికరాలను సొంతంగా మరమ్మతు చేయకుండా అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్తోనే మరమ్మతు చేయించుకోవాలి.
- లూజ్గా ఉన్న విద్యుత్ తీగలను కర్రలతో పైకి లేపే ప్రయత్నం చేయరాదు. వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు లేదా 1912కు సమాచారం అందించాలి.
- నాసిరకం లేదా అతుకులు ఉన్న సర్వీస్ వైర్లను ఉపయోగించరాదు.
- అడవి జంతువుల వేట కోసం విద్యుత్ వినియోగించడం అత్యంత ప్రమాదకరమైన చర్య. ఇది మీకు, మీ తోటి వారికి ప్రాణహాని కలిగించడమే కాకుండా చట్టరీత్యా నేరం.

ప్రజల అప్రమత్తత, విద్యుత్ భద్రతా నియమాల పట్ల అవగాహనతోనే విద్యుత్ ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ విద్యుత్ శాఖకు సహకరించాలని డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్), టీజీఎన్పీడీసీఎల్, ములుగు విజ్ఞప్తి చేశారు.

"విద్యుత్ భద్రత – మన బాధ్యత... ప్రాణ రక్షణ మన చేతుల్లోనే ఉంది."

Divisional Engineer Elec.
Operation: TSNPDCL
MULUGU

ఇది ప్రాణాపాయం కలిగించడమే కాకుండా చట్టరీత్యా నేరం.ఎలక్ట్రికల్ లైన్ల కింద బోర్లు వేయరాదు. బోరు మోటార్లను మరమ్మతుల కోసం పైకి తీసేటప్పుడు సమీప విద్యుత్ లైన్లకు తగలకుండా అత్యంత జాగ్రత్త వహించాలి.తడి బట్టలు ఆరబెట్టేందుకు ఇనుప రాడ్లు లేదా ఇనుప దండాలు ఉపయోగించరాదు. ప్లాస్టిక్ తాడులను మాత్రమే ఉపయోగించాలి.విద్యుత్ ప్రవాహాన్ని ఉపయోగించి చేపలు పట్టరాదు. ఇది ప్రాణాపాయంతో పాటు చట్టరీత్యా నేరం.చెడిపోయిన విద్యుత్ పరికరాలను సొంతంగా మరమ్మతు చేయకుండా అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్తోనే మరమ్మతు చేయించుకోవాలి.లూజ్గా ఉన్న విద్యుత్ తీగలను కర్రలతో పైకి లేపే ప్రయత్నం చేయరాదు. వెంటనే సంబంధిత విద్యుత్ అధికారులకు లేదా 1912కు సమాచారం అందించాలి.నాసిరకం లేదా అతుకులు ఉన్న సర్వీస్ వైర్లను ఉపయోగించరాదు.అడవి జంతువుల వేట కోసం విద్యుత్ వినియోగించడం అత్యంత ప్రమాదకరమైన చర్య. ఇది మీకు, మీ తోటి వారికి ప్రాణహాని కలిగించడమే కాకుండా చట్టరీత్యా నేరం.ప్రజల అప్రమత్తత, విద్యుత్ భద్రతా నియమాల పట్ల అవగాహనతోనే విద్యుత్ ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ విద్యుత్ శాఖకు సహకరించాలని డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్), టీజీఎన్పీడీసీఎల్, ములుగు విజ్ఞప్తి చేశారు."విద్యుత్ భద్రత -- మన బాధ్యత... ప్రాణ రక్షణ మన చేతుల్లోనే ఉంది."

# భారీ ఇళ్ల దొంగతనం కేసును 36 గంటల్లో ఛేదించిన నారాయణగూడ పోలీసులు

**- నిందితుడి అరెస్ట్ చేసి రూ. 7,70,000/- నగదు స్వాధీనం**



**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 03 (పీపుల్స్ న్యూస్) :** భారీ ఇళ్ల దొంగతనం కేసును 36 గంటల్లో నారాయణగూడ పోలీసులు చేదించారు. ఈ కేసులో నిందితుడి అరెస్ట్ చేసి రూ. 7,70,000/- నగదు స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం....... పాత బోయినపల్లి కి చెందిన దీపేష్ ఖాతి (19) నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న అమిత్ అగర్వాల్ ఒక తన భార్య, కుమారులతో కలిసి నివసిస్తున్నారు. డిసెంబర్ 2025 నుండి వారి ఇల్లు పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల నిమిత్తం ఆయన తన వద్ద ఉన్న రూ. 7,70,000/- నగదును (500 రూపాయల నోట్ల కట్టలను) భార్య హ్యాండ్ బ్యాగులలో ఉంచి, మొదటి అంతస్తు బెడ్రూమ్లోని చెక్క అల్మారాలో భద్రపరిచారు. జూన్ 30, 2026 ఉదయం 09:30 గంటల సమయంలో భార్య సదరు బ్యాగులను పరిశీలించగా నగదు సురక్షితంగానే ఉంది. కాగా, సాయంత్రం 05:30 గంటల సమయంలో బెడ్రూమ్కు తాళం వేయకుండానే ఆమె వాకింగ్కు వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో అన్ని అంతస్తులలో కార్మికులు పనులు చేస్తున్నారు. సాయంత్రం 06:30 గంటలకు ఆమె తిరిగి వచ్చినప్పుడు ఎలాంటి అనుమానాస్పద మార్పులు గమనించలేదు. అయితే రాత్రి 09:30 గంటల సమయంలో అల్మారా తెరిచి చూడగా హ్యాండ్ బ్యాగుల్లో ఉంచిన నగదు కనిపించలేదు. ఇల్లంతా వెతికినా నగదు లభించకపోవడంతో, ఇంట్లో పనులు చేస్తున్న కార్మికుల్లో ఎవరో ఒకరు తమ సమయం చూసి దొంగతనానికి పాల్పడి ఉంటారని అనుమానిస్తూ బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.కేసు నమోదు చేసుకున్న వెంటనే నారాయణగూడ క్రైమ్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించింది. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, సాంకేతిక ఆధారాలను విశ్లేషించడంతో పాటు ఇంట్లో పనులు చేస్తున్న కార్మికులందరినీ క్షుణ్ణంగా విచారించారు. ఖచ్చితమైన సాంకేతిక నిఘా ఆధారంగా శుక్రవారం ఉదయం 10:20 గంటల సమయంలో నిందితుడైన దీపేష్ ఖాతిని పోలీసులు విజయవంతంగా అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ బోయినపల్లిలోని అతని గది నుండి దొంగిలించబడిన రూ. 7,70,000/- నగదును పోలీసులు పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును సుల్తాన్ బజార్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎమ్. మత్తయ్య పర్యవేక్షణలో, నారాయణగూడ పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ బి. అభిలాష్, సబ్-ఇన్స్పెక్టర్ చ. నాగరాజు , క్రైమ్ టీమ్ సిబ్బంది కలిసి విజయవంతంగా ఛేదించారు.

# అంతర్రాష్ట్ర గంజాయి అక్రమ రవాణా ముఠా అరెస్టు

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 03 (పీపుల్స్ న్యూస్) :** అంతర్రాష్ట్ర గంజాయి అక్రమ రవాణా ముఠాను చార్మినార్ టాస్క్ఫోర్స్ ట అబిడ్స్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 23 కిలోల గంజాయి, (02) మొబైల్ ఫోన్లు రూ. 7,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...... నమ్మదగిన సమాచారం మేరకు, హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్ఫోర్స్ చార్మినార్ జోన్ బృందం , అబిడ్స్ పోలీస్ స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా దాడి నిర్వహించారు. అబిడ్స్ పి.ఎస్ పరిధిలోని నాంపల్లి, హజ్ హౌస్ సమీపంలో భారీగా నిషేధిత డ్రై గంజాయిని కలిగి ఉన్న ముగ్గురు నిందితులు మరియు +జీజూ మహారాష్ట్రలోని పర్భనికి చెందినవారని తేలింది. నిందితులలో అమిత్ అచ్యుత్రావ్ కాలే, సీమా నితిన్ పోత్భారే భార్యాభర్తలు. వీరు ఆర్తి మారుతి ఖండారే జీజేసీఎల్ ల సహాయంతో కమిషన్ ప్రాతిపదికన ఒడిశా , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి మహారాష్ట్రకు గంజాయిని అక్రమంగా రవాణా చేయడానికి అలవాటు పడ్డారు. గత (06) నెలలుగా వీరు ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఏజెన్సీ ప్రాంతాల నుండి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తూ, అక్కడ ఉన్న తమ కస్టమర్లకు సరఫరా చేస్తూ భారీగా అక్రమ లాభాలు ఆర్జిస్తున్నారు.సుమారు (04) రోజుల క్రితం వీరు విశాఖపట్నంలోని అరకు ఏజెన్సీ ప్రాంతాన్ని సందర్శించి, ఆంధ్రప్రదేశ్లోని అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకు నివాసి అయిన గోవింద్ అనే వ్యక్తి నుండి కిలో రూ. 6,000 చొప్పున సుమారు (23) కిలోల పొడి గంజాయిని కొనుగోలు చేశారు. దీనిని మహారాష్ట్రకు చెందిన తమ కస్టమర్లు అయిన అఫ్తాబ్ అఫ్జల్ ఖాన్ (పర్లి), మీరా భాయ్ (పర్భని), ఆమ్రపాలి (పర్భని) లకి సరఫరా చేయాలని నిర్ణయించుకున్నారు. ప్రధాన సరఫరాదారు గోవింద్ నుండి గంజాయిని సేకరించిన తర్వాత, నిందితులు జీజేసీఎల్ కలిసి ఈ నెల 01వ తేదిన విశాఖపట్నం రైల్వే స్టేషన్లో రైలు ఎక్కారు. 02వ తేదిన ఉదయం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో దిగి, అక్కడ నుండి ఆటోలో నాంపల్లి హజ్ హౌస్కు చేరుకుని, మహారాష్ట్ర వెళ్లే ప్రైవేట్ బస్సు కోసం నిరీక్షిస్తున్నారు. ఈ లోగా అందిన ఖచ్చితమైన సమాచారం ఆధారంగా పోలీసులు దాడి చేసి, నిందితులను/సీసీఎల్ ను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి నిషిద్ధ గంజాయిని





స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసులో ప్రధాన సరఫరాదారు అయిన అరకు, ఎ.ఎస్.ఆర్ జిల్లాకు చెందిన గోవింద్, గంజాయిని స్వీకరించే కస్టమర్లు అయిన మహారాష్ట్ర , పర్లి అఫ్తాబ్ అఫ్జల్ ఖాన్ , మహారాష్ట్ర పర్భని కి చెందిన మీరా భాయ్ , ఆమ్రపాలి ప్రస్తుతం పరారీలో ఉన్నారు.హైదరాబాద్ సిటీ కమిషనర్స్ టాస్క్ఫోర్స్, చార్మినార్ జోన్ టీమ్ ఇన్స్పెక్టర్ శ్రీ ఎస్. సైదాబాబు పర్యవేక్షణలో, సబ్ ఇన్స్పెక్టర్లు ఎమ్. మధు, కె. రామారావు, ఎమ్. మహేష్ , టాస్క్ఫోర్స్ సిబ్బందితో పాటు అబిడ్స్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఈ ఆపరేషన్లో పాల్గొని నలుగురు అంతర్రాష్ట్ర గంజాయి రవాణాదారులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి (23) కిలోల పొడి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

# ఆపరేషన్ ముస్కాన్ -- 12 సమన్వయ సమావేశం








**సైబరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 03 (పీపుల్స్ న్యూస్) : ,** సైబరాబాద్ సీపీ కార్యాలయం, ఆడిటోరియంలో శుక్రవారం"ఆపరేషన్ ముస్కాన్-12" సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ పాల్గొని తప్పిపోయిన పిల్లలను గుర్తించడం , భిక్షాటన, పాత వస్తువులు ఏరుకోవడం, బాల కార్మికత్వం/బాలల అక్రమ రవాణా, వెట్టిచాకిరి మొదలైన వాటి నుండి పిల్లలను రక్షించడం కోసం ఏర్పాటు చేయబడిన ఆపరేషన్ ముస్కాన్-12 యొక్క కార్యాచరణకు సంబంధించి సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరాశ్రయులైన పిల్లలను, బాల కార్మికత్వంలోకి బలవంతంగా నెట్టబడిన వారిని రక్షించి, పునరావాసం కల్పించడానికి , భిక్షాటన చేసే పిల్లలను, పాత వస్తువులు ఏరుకునే పిల్లలను గుర్తించడానికి సైబరాబాద్ పోలీసులు 1 జూలై, 2026 నుండి 31 జూలై, 2026 వరకు "ఆపరేషన్ ముస్కాన్-12"ను ప్రారంభిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఒక మహిళా పోలీస్ కానిస్టేబుల్‌తో సహా సబ్ ఇన్‌స్పెక్టర్, (4) మంది పోలీస్ కానిస్టేబుళ్లతో కూడిన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. బాల కార్మిక వ్యవస్థ , అక్రమ రవాణాలో చిక్కుకున్న పిల్లలను గుర్తించి, రక్షించి/పునరావాసం కల్పించడానికి మొత్తం (07) బృందాలను ఏర్పాటు చేశారు. ఈ సంప్రదింపుల సమావేశంలో సైబరాబాద్ డీసీపీ (మహిళలు & బాలల భద్రతా విభాగం) కె. సృజన మాట్లాడుతూ, "తప్పిపోయిన పిల్లలు, గుర్తుతెలియని పిల్లలు, వివిధ కారణాల వల్ల తమ కుటుంబాల నుండి విడిపోయిన పిల్లలను గుర్తించడానికి మేము 'దర్పణ్' అనే ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను ఉపయోగిస్తాము" అని తెలిపారు.సైబరాబాద్ డీసీపీ (మహిళలు & బాలల భద్రతా విభాగం) కె. సృజన ఈ బృందాల కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. "సంబంధిత శాఖల అధికారుల సహకారంతో 'ఆపరేషన్ ముస్కాన్-12' జూలై నెలాఖరు వరకు కొనసాగుతుంది" అని సైబరాబాద్ ఏహెచ్‌టీయూ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పి. యదయ్య గౌడ్ తెలిపారు. గత కేసుల డేటా ఆధారంగా, పిల్లలను బలవంతపు కార్మిక వ్యవస్థలోకి నెట్టిన ప్రాంతాలను పోలీసులు గుర్తించారు. "ఈ బృందాలు ఇతర సంబంధిత శాఖలతో కలిసి రక్షణ , పునరావాస పనులను సమన్వయం చేస్తాయి."ఈ సమావేశంలో మహిళలు , బాలల సంక్షేమం ఏసీపీ ఎస్. కృష్ణ ప్రసాద్, మెడ్చల్ జిల్లా బాలల సంక్షేమ కమిటీ రాజారెడ్డి, సంగారెడ్డి జిల్లా సహాయ కార్మిక కమిషనర్ డి. సాహితి, రంగారెడ్డి జిల్లా బాలల రక్షణ అధికారి ప్రవీణ్ కుమార్, మెడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలల రక్షణ అధికారి ఇంతియాజ్, సంగారెడ్డి జిల్లా బాలల రక్షణ అధికారి రత్నం, సంగారెడ్డి బాలల సంక్షేమ కమిటీ సభ్యులు జి. వెంకటేశం, రంగారెడ్డి జిల్లా వైద్య అధికారి హలీం, సైబరాబాద్ ఏహెచ్‌టియు పోలీస్ ఇన్‌స్పెక్టర్ యదయ్య గౌడ్, ఏహెచ్‌టియు సిబ్బంది ,ఇతరులు పాల్గొన్నారు.

# షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



**రామగుండం,జూలై 3 -** గోదావరిఖని చౌరస్తాలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. అనంతరం కాంప్లెక్స్‌లోని వివిధ దుకాణాలను పరిశీలించి, యజమానులతో మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ గోదావరిఖనిలో వాణిజ్య రంగం రోజురోజుకు అభివృద్ధి చెందడం సంతోషకరమన్నారు.ఇటువంటి నూతన వ్యాపార సముదాయాలు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు పట్టణ ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు.వ్యాపారులు నాణ్యమైన సేవలు అందిస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని పొందాలని సూచించారు.రామగుండం నియోజకవర్గంలో వ్యాపార,వాణిజ్య రంగాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, కార్పొరేటర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ భూతాన్ని పారదోలుదాం




**రామగుండం,జూలై 3 -** ప్లాస్టిక్ భూతాన్ని పారదోలుదాం పర్యావరణాన్ని కాపాడుదాం అని కళాశాల ఎకో క్లబ్,ఎన్ ఎస్ ఎస్ మరియు ఎన్ సీ సీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జై కిషన్ ఓఝా పిలుపు నిచ్చారు.కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ హైదరాబాద్ వారు తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలతో జూన్ నెల మూడవ తేదీన చేసుకున్న ఒప్పంద ప్రకారం - ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించుకోవడాన్ని ప్రోత్సహిస్తుందని పిలుపు నిచ్చారు.ఈ మిషన్ లో భాగంగా నేడు మన కళాశాలలో తొలి అడుగు పడిందన్నారు.పేపర్ ప్లేట్స్,ప్లాస్టిక్ ప్లేట్స్ & గ్లాసులు,వాటర్ బాటిల్స్ కి బదులుగా స్టీల్ ప్లేట్స్,స్టీల్ గ్లాసులు మరియు స్టీల్ వాటర్ బాటిల్స్ ఉపయోగిస్తూ పర్యావరణ పరిరక్షణ కోసం పాటు పడతామని అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్ సి సి క్యాడెట్స్ అండ్ కళాశాల ఎకో క్లబ్ మెంబెర్స్ తో ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆచార్య జై కిషన్ ఓఝా స్టీల్ ప్లేట్స్, వాటర్ బాటిల్స్,గ్లాసులు స్వచ్ఛందంగా కొనుగోలు చేసి ఎకో క్లబ్ తరుపున వాటిని వితరణ చేశారు.

# నెల రోజుల పాపను కిడ్నాప్ చేసిన అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

**- పాపను రక్షించిన చందనగర్ పోలీసులు**









**సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో, జూలై 03 (పీపుల్స్ న్యూస్):** నెల రోజుల పాపను కిడ్నాప్ చేసిన అంతర్రాష్ట్ర ముఠా ను చందనగర్ పోలీసులు అరెస్టు చేసి పాపను రక్షించారు. ఈ సంఘటన చందనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం..... కర్ణాటక రాష్ట్రం, బీదర్ జిల్లా, బల్కి గ్రామం, బస్వానగర్ కాలనీకి చెందిన, సర్కస్ కార్మికురాలైన, సుమారు 25 సంవత్సరాల వయస్సు గల మలన్ గౌరవ్ శాంత బాయి గత నెల 30వ తేదిన తన సర్కస్ బృందంలోని సభ్యులతో కలిసి లింగంపల్లి రైల్వే స్టేషన్ గోడ పక్కన ఉన్న ఫుట్‌పాత్‌పై నిద్రిస్తుండగా, కొంతమంది గుర్తు తెలియని దుండగులు ఆటో-రిక్షాలో వచ్చి, ఆమె ఒడిలో ఉన్న నెల రోజుల పాపను బలవంతంగా లాక్కెళ్లారు. పసిపాప ఏడుపు విని ఆమె మేల్కొని, దుండగులను తరిమికొట్టడానికి ప్రయత్నించగా, వారు ఆటో-రిక్షాలో అక్కడినుంచి పారిపోయారు.దీంతో ఆమె చందనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదు చేసిన వెంటనే, అపహరణకు గురైన పసిపాప ఆచూకీ కనుగొనేందుకు సెరిలింగంపల్లి జోన్, ఆర్‌సీపురం డివిజన్ ఏసీపీ సి.హెచ్. వై. శ్రీనివాస్ నాయకత్వంలో మూడు పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు చందానగర్ ఇన్స్పెక్టర్ ఎస్.విజయ్, అమీన్‌పూర్ డీఐ సత్యనారాయణ, చందానగర్ డీఐ ఎన్. భాస్కర్ నేతృత్వంలోని బృందాలు సైబరాబాద్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్ నగరాల్లో 3 రోజుల పాటు పెద్దఎత్తున సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, బాలికలందరినీ అదుపులోకి తీసుకున్నారు విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం, పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా, టాప్సియా నివాసి, సుమారు 30 ఏళ్ల వయస్సు రహనుమా అలీ, 2021 సంవత్సరంలో మొహమ్మద్ సనావర్‌ను వివాహం చేసుకున్నారు. ఆమెకు పిల్లలు లేరు. ఆమె డబ్బు చెల్లించి దత్తత కోసం ఒక బిడ్డను ఏర్పాటు చేయమని బంజారా హిల్స్ శ్రీ డేటా రెసిడెన్సీకి చెందిన తన అత్త నిమ్మీ జహాన్ అలీ ఏ సీమా అలీ లు, ను కోరారు. సీమా, ఈ విషయాన్ని నేరెడ్‌మెట్‌కు చెందిన తన స్నేహితురాలు నజియాకు తెలియజేసింది. నజియా ఈ సమాచారాన్ని వికారాబాద్‌కు చెందిన తన కాబోయే భర్త, నిందితుడు జుబేర్‌కు చేరవేసి, నవజాత శిశువును సంపాదించి పెట్టినందుకు గణనీయమైన డబ్బు ఇస్తానని వాగ్దానం చేసింది. నిందితుడు జుబేర్, వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక దొంగతనం కేసులో గతంలో నేరస్థుడిగా ఉన్న ఆటో డ్రైవర్, తన సహచరుడు ఇర్ఫాన్‌ను సంప్రదించాడు. అక్రమ లాభం కోసం ఒక పసికందును అపహరించి, అమ్మేయడానికి నిందితులిద్దరూ నేరపూరిత కుట్రకు పాల్పడ్డారు. తగిన లక్ష్యం కోసం వెతుకుతున్న క్రమంలో, చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న ఫిర్యాదిదారురాలు ఆమె నెల రోజుల పసిపాపను వారు గమనించారు.తమ ఉమ్మడి ఉద్దేశాన్ని నెరవేర్చుకోవడానికి, గత నెల 30న తెల్లవారుజామున, నిందితులు తమ స్నేహితుడు ఆరిఫ్‌కు చెందిన ఆటో-రిక్షాను అద్దెకు తీసుకుని, ఆ ప్రదేశానికి చేరుకుని, సుమారు 02:00 గంటలకు నిద్రిస్తున్న తల్లి ఒడిలో ఉన్న నెల రోజుల పసిపాపను బలవంతంగా అపహరించారు. నేరం చేసిన తర్వాత, వారు ఆ పాపను నజియా ఇంటికి తీసుకువెళ్లి, అపహరణ విజయవంతమైన విషయాన్ని సీమా , రెహనుమా అలీలకు తెలియజేశారు.ఈ నెల 1 న రెహనుమా అలీ అపహరణకు గురైన శిశువును తన సంరక్షణలోకి తీసుకోవడానికి తన అత్త సర్వరితో కలిసి కలకత్తా నుండి హైదరాబాద్‌కు విమానంలో ప్రయాణించారు. ఈ కుట్రలో భాగంగా, నిందితుడు జుబేర్ ఆ శిశువును అక్రమంగా అమ్మినందుకు గాను రెహనుమా అలీ నుండి ఆన్‌లైన్ చెల్లింపు ద్వారా రూ.1,50,000/- స్వీకరించాడు. నిందితులు అపహరణకు గురైన శిశువుతో కలకత్తాకు పారిపోయేలోపే, పోలీసు బృందం నిందితులందరినీ విజయవంతంగా పట్టుకున్నారు. నెల రోజుల పసిపాపను రక్షించి, ఆమెను క్షేమంగా కన్నతల్లికి అప్పగించింది. సత్వర దర్యాప్తు, సమన్వయంతో కూడిన బృందకృషి, విజయవంతమైన రక్షణ చర్య అంతర్రాష్ట్ర బాలల అక్రమ రవాణా , అపహరణ ముఠాను ఛేదించడానికి దారితీశాయి. దర్యాప్తు బృందాల సమన్వయ ప్రయత్నాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ప్రశంసించారు.

# నూతన ఎంపీడీవో గా జెల్ల పాండు బాధ్యతల స్వీకరణ



**చిట్యాల, జూలై 3 :** చిట్యాల మండల అభివృద్ధి అధికారిగా జెల్ల పాండు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు రాష్ట్ర ఎన్నికల సంఘం, హైదరాబాద్ లో విధులు నిర్వహిస్తున్న ఆయనను చిట్యాల మండలానికి బదిలీ చేయగా, నూతన ఎంపీడీవోగా పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన కార్యాలయ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించి, మండల అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామపంచాయతీల పరిపాలనకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జె. పాండు మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో పారదర్శకత, సమర్థతకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.మండల ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించి, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ పథకాల ఫలాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

శనివారం, జూలై 04, 2026 | హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక | 6

# ఇందిరమ్మ నూతన గృహప్రవేశం

**- రాష్ట్ర మంత్రి సతీమణి వాకిటి లలిత**

**నర్వ జులై 3** మండల కేంద్రంలోని శుక్రవారం రోజున శరణప్ప ఇందిరమ్మ నూతన గృహప్రవేశం నీకి హాజరైన రాష్ట్ర మంత్రి సతీమణి వాకిటి లలితమ్మ నూతన గృహా ప్రవేశానికి హాజరై ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారుల దంపతులకు కానుక అందజేశారు ఇట్టి కార్యక్రమానికి నర్వ మండల కాంగ్రెస్ పార్టీఅధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి ఎం రవీందర్ రెడ్డి గ్రామ సర్పంచ్ టి హనుమంత్ రెడ్డి కొత్తపల్లి సంజీవరెడ్డి మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు పి హనుమంత్ రెడ్డి నాగన్న గారి వివేకవర్ధన్ రెడ్డి గ్రామస్తులు తదితరులు గృహ ప్రవేశం లో పాల్గొన్నారు

# ప్రజాస్వామ్యానికి బలమైన పునాది... ఓటర్ల ప్రత్యేక ముమ్మర సవరణ (SIR)

- ఇంటింటికీ ఎన్నికల అధికారులు... ప్రతి ఓటరు వివరాల సమీకరణే లక్ష్యం
- అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచాలని కాప్రా తహసీల్దార్ మతీన్ పిలుపు



**కాప్రా, జూలై 3 :** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన రాజ్యాంగబద్ధ హక్కు. ప్రతి అర్హుడికి సరైన ఓటరు గుర్తింపు ఉండేలా, ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఓటర్ల ప్రత్యేక ముమ్మర సవరణకార్యక్రమం కాప్రా మండలంలో వేగంగా కొనసాగుతోంది.కాప్రా, దమ్మాయిగూడ, జవహర్‌నగర్, నాగారం తదితర ప్రాంతాల్లో ఎన్నికల అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు చేపడుతున్నారు. ఈ ప్రక్రియలో ప్రతి కుటుంబం ఎన్నికల సిబ్బందికి సహకరించాలని కాప్రా తహసీల్దార్ (ఎంఆర్వో) శ్రీ మతీన్ కోరారు.సర్వే సమయంలో ఓటర్లు ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, కుల ధృవీకరణ పత్రం, ప్రభుత్వం జారీ చేసిన ఇతర గుర్తింపు పత్రాలను సిద్ధంగా ఉంచితే వివరాల ధృవీకరణ త్వరగా పూర్తవుతుందని తెలిపారు.ఈ ప్రత్యేక సవరణ ద్వారా కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, వివరాల సవరణ, అర్హత లేని పేర్ల తొలగింపు వంటి ప్రక్రియలు పారదర్శకంగా జరుగుతాయని అధికారులు పేర్కొంటున్నారు."ప్రతి ఓటు విలువైనదే... ప్రతి ఓటరు బాధ్యతతో ముందుకు రావాలి" అనే సందేశంతో ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఎన్నికల సిబ్బందికి సహకరించాలని తహసీల్దార్ శ్రీ మతీన్ విజ్ఞప్తి చేశారు.ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఈ ప్రత్యేక ముమ్మర సవరణ కార్యక్రమంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావడం సమాజం పట్ల బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు.

# పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించాలి : దౌల్తాబాద్ తహసిల్దార్ చంద్రశేఖర రావు.

**- ఎస్ఐఆర్ ఫారమ్‌ల అన్‌లోడింగ్‌పై శిక్షణా సమావేశం.**




**దౌల్తాబాద్, జూలై 3** దౌల్తాబాద్ మండల కేంద్రంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఫారమ్‌ల అన్‌లోడింగ్‌కు సంబంధించిన సమావేశం శుక్రవారం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో ఫారమ్‌ల నిర్వహణ, నమోదు ప్రక్రియ, క్షేత్రస్థాయి విధులపై అవగాహన కల్పించారు. దౌల్తాబాద్ తహసీల్దార్ చంద్రశేఖర్ రావు, డిప్యూటీ తహసీల్దార్ జహీర్ పాల్గొని బిఎల్ వో లు, జిపిఓ లు, సూపర్వైజర్లకు పలు సూచనలు చేశారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని బి ఎల్ ఓ లు, జిపిఓ లు, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులను మోసం చేసిన ప్రభుత్వానికి పతనం తప్పదు

**టి యు జె ఎస్ సి రాష్ట్ర కమిటీ సభ్యులు పెంట సభ్యులు పెంట సత్యనారాయణ**

**రాజపేట జూలై: 03**
ఉద్యమ కారులారా ఏకంకండి. మరో పోరాటానికి సిద్ధం కండి. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప.తెలంగాణ ఉద్యమకారులకు మోసం చేసిన ప్రభుత్వానికి రానున్న ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలలో పతనం తప్పదు. కాంగ్రెస్ పార్టీ మేని ఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తే ఉద్యమకారులపై దాడులా? ఇప్పుడు మనకు తెలంగాణ రాష్ట్రం వచ్చినందుకు బాధ పడాలో మనం సాధించుకున్న తెలంగాణలో ఇటువంటి పరిస్థితులు చూస్తున్నందుకు సిగ్గు పడాలో అర్థం కావడం లేదు. మొన్న వేసిన కేకే కమిటీ ఉద్యమకారులను మభ్యపెట్టి కాలయాపన చేయడానికి మాత్రమే అని దీన్ని బట్టి చూస్తే అర్థమవుతుంది. అందుకే కేకే కమిటీతో ఉద్యమకారులకు ఒరిగేది ఏమీ లేదు కాలం లేని కాలయాపన కమిటీగా అది తయారైంది కాబట్టి ఉద్యమకారులకు పోరాటమే మార్గమని తలపిస్తుంది. అందుకోసమే సచివాలయాన్ని తొందరలోనే ముట్టడి చేయాలి. అందుకోసమే తెలంగాణ ఉద్యమ కారులందరూ సిద్ధంగా ఉండాలని తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు పెంట సత్యనారాయణ ప్రకటనలో తెలిపారు.

# ప్రజలకు చేరువగా పోలీసింగ్.. సాంకేతికతతో సమర్థవంతమైన సేవలే లక్ష్యం: రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్







**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో జూలై 03 (పీపుల్స్ న్యూస్)**
రాష్ట్రంలో ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన, సాంకేతికత ఆధారిత పోలీసు సేవలను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర పోలీసు శాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ అధ్యక్షతన డీజీపీ కార్యాలయంలో రాష్ట్రంలోని అన్ని యూనిట్ల అధికారులు, కమిషనర్లు, ఎస్పీలు, ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్న ఉన్నత స్థాయి సమీక్ష సమావేశంలో పోలీసింగ్‌కు సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు కనిపించే పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం

ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేందుకు "విజిబుల్ పోలీసింగ్"ను మరింత బలోపేతం చేయాలని డీజీపీ స్పష్టం చేశారు. ప్రతి పోలీసు అధికారి ప్రజలకు అందుబాటులో ఉండాలని, క్షేత్రస్థాయిలో పర్యటి స్తూ స్థానిక సమస్యలను స్వయంగా తెలుసుకుని వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని





సూచించారు. యూనిట్ అధికారులు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్లను తరచూ తనిఖీ చేసి నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, ప్రజల ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో పారదర్శకత పెంపు పోలీస్ స్టేషన్లలో విజిటింగ్ అవర్స్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని, క్యాంప్ కార్యాలయాల కంటే అధికారులు తమ అధికారిక కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. కొంతమంది అధికారుల పనితీరుపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఇకపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హెచ్చరించారు. ముఖ్యంగా భూవివాదాలు వంటి సివిల్ స్వభావం కలిగిన అంశాల్లో పోలీసులు అనవసరంగా జోక్యం చేసుకోకూడదని స్పష్టం చేశారు. సాంకేతిక పోలీసింగ్‌కు మరింత ఊతం రాష్ట్రంలో సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని డీజీపీ ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ (జజుచీూ), ఈ–సాక్ష్యం, లాటీ యాప్ వంటి డిజిటల్ వ్యవస్థలను పూర్తిస్థాయిలో వినియోగించాలని, ప్రతి ఎఫ్ఐఆర్‌కు సంబంధించిన ఆధారాలను ఈ–సాక్ష్యం పోర్టల్‌లో సకాలంలో అప్‌లోడ్ చేయాలని సూచించారు.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సీసీటీఎన్ఎస్ అప్‌డేషన్ 60 నుంచి 70 శాతం వరకు పూర్తయిందని తెలిపారు. ఈ ప్రక్రియలో ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు ముందంజలో ఉండగా, ఈ–సాక్ష్యం అమలులో భూపాలపల్లి (55%), సిద్ధిపేట (39%), నల్గొండ (31%) మెరుగైన పనితీరు కనబరిచాయని వెల్లడించారు. అలాగే ఈ–సమన్ల అమలులో కామారెడ్డి (92.86%), వనపర్తి (92%) జిల్లాలు ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు.సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు పోలీసు అధికారులు సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం పెంపొందించుకోవాలని డీజీపీ సూచించారు. కొత్త తరహా సైబర్ మోసాలను ఎదుర్కొనేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తామని తెలిపారు.ముఖ్యంగా హైదరాబాద్‌లోని నాలుగు కమిషనరేట్ల పరిధిలోనే రాష్ట్రంలోని సుమారు 70 శాతం సైబర్ నేరాల కేసులు నమోదవుతున్నందున, వాటి నమోదు, దర్యాప్తు, నిందితుల గుర్తింపులో వేగం పెంచాలని ఆదేశించారు. నార్కోటిక్స్, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ మాదకద్రవ్యాల నియంత్రణకు అన్ని జిల్లాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని డీజీపీ సూచించారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం పోలీసుల సామాజిక బాధ్యతగా అభివర్ణించారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ అండ్ సేఫ్టీ కమిటీలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈగల్ విభాగం చేపడుతున్న అవగాహన కార్యక్రమాలను అభినందిస్తూ, ఇప్పటివరకు 825 మంది విద్యార్థులకు కౌన్సెలింగ్, పునరావాస సేవలు అందించినట్లు సమావేశంలో వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు మరిన్ని చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తోందని డీజీపీ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్య తగ్గుముఖం పట్టినట్లు తెలిపారు. వాహనాల తనిఖీలను మరింత ముమ్మరం చేయాలని, అత్యవసర సేవల స్పందనను వేగవంతం చేయాలని ఆదేశించారు. అదే సమయంలో 112 అత్యవసర సేవలను డ్రోన్ టెక్నాలజీతో అనుసంధానించే ఆధునిక వ్యవస్థను త్వరలో ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సోషల్ మీడియా పుకార్లపై అప్రమత్తంగా ఉండాలి సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న తప్పుడు ప్రచారాలు, పుకార్లు, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే పోస్టులపై నిరంతర నిఘా ఉంచాలని అధికారులకు డీజీపీ సూచించారు. చట్టవ్యతిరేక ప్రచారాలను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసలు విధుల్లో విశేష ప్రతిభ కనబరిచిన పలువురు పోలీసు అధికారులను డీజీపీ ప్రత్యేకంగా అభినందించారు. జగిత్యాల జిల్లా మెట్పల్లి ఎస్ఐ అన్వర్ బేగం డయల్–100 అత్యవసర కాల్‌కు వేగంగా స్పందించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడబోయిన వ్యక్తిని రక్షించినందుకు ప్రశంసలు అందుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ అధికారి నరేష్ నేపాలీ దొంగల ముఠాను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచినందుకు అభినందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి హత్య కేసును సమర్థంగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడేలా చేసిన సీఐ రమాకాంత్, దర్యాప్తు అధికారి కె. నవీన్ కుమార్, సీఐ శ్రీనివాస్‌లను ప్రశంసించారు. మెదక్ జిల్లా శివంపేట హత్య కేసులో సమగ్ర దర్యాప్తు నిర్వహించి యావజ్జీవ కారాగార శిక్ష పడేలా చేసిన సీఐ శ్రీధర్, దర్యాప్తు అధికారి వెంకటరాజ గౌడ్‌లను అభినందించారు. నల్గొండ జిల్లాలో మోస్ట్ వాంటెడ్ నిందితుడిని ధైర్యసాహసాలతో పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ విష్ణును ప్రత్యేకంగా ప్రశంసిస్తూ వీరందరికీ డీజీపీ కార్యాలయంలో రివార్డులు అందజేస్తామని ప్రకటించారు. సమర్థవంతమైన పోలీసింగ్‌కు నిబద్ధత అవసరం సమావేశం ముగింపులో డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించేందుకు ప్రతి అధికారి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా పోలీసింగ్‌ను రూపుదిద్దాలని, నేర నియంత్రణతో పాటు ప్రజా సేవలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో లా అండ్ ఆర్డర్ డీజీ మహేష్ భగవత్, సీఐడీ డీజీ చారు సిన్హా, టెక్నికల్ సర్వీసెస్ డీజీ శ్రీనివాసరావు, మల్టీ జోన్–1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, మల్టీ జోన్–2 ఐజీ షానవాజ్ ఖాసిం, కమిషనర్లు, డీఐజీలు, ఎస్పీలు, యూనిట్ అధికారులు, ఎస్‌హెచ్‌వోలు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ సమావేశాలపై కసరత్తు !

ఈ నెలాఖరులో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లోనే మరోమారు మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లులను పెట్టే యోచనలో కేంద్రం ఉంది. అయితే గత సమావేశాల్లో ఈ రెండు బిల్లులు వీగిపోయాయి. అయినా కేంద్రం తన పట్టును విడవకుండా ముందుకు సాగాలన్న యోచన లో ఉంది. ఈ బిల్లులు పాస్ కావాలంటే మూడోవంతు మెజార్టీ అవసరం. అందుకుత తగ్గ కసరత్తు చేస్తున్నట్లుగా ఉంది. ఇదే సందర్భంలో అన్ని పార్టీలతో చర్చించే ప్రయత్నం మాత్రం చేయడం లేదు. అందరి అభిప్రాయాలను తీసుకుని ముందుకు సాగాలన్న ఆనవాయితీని బిజెపి ఎప్పుడో విడనాడింది. గతంలో సమస్యలు లేదా బిల్లులకు సంబంధించి ముందస్తు అఖిపలక్ష సమావేశాలు జరిగేవి. కానీ అలాంటి ఆనవాయితీని బిజెపి పాటించడం లేదు. దాదాపు 12 ఏళ్లుగా ఏకాభిప్రాయ సాధనలో మోడీ ఏనాడూ ప్రయత్నం చేయలేదు. ఇకపోతే ఏం జరుగుతుందో కూడా ప్రతిపక్షాల ఊహకు కూడా అందడం లేదు. ఈ క్రమంలో రేపటి బిల్లులను ఎప్పుడు, ఎలా ప్రవేశ పెడతారన్నది కేవలం మోడీ, అమిత్ షాలకు మాత్రమే తెలిసి ఉంటుంది. కేంద్రమంత్రులు, బిజెపి నేతలకు కూడా వీటిపై సమాచారం ఉండకపోవచ్చు. ఇలా గోప్యత పాటించడం వల్ల వచ్చే లాభం ఏమిటన్నది కూడా వారికే తెలుసు. ఇకపోతే పార్లమెంట్ సమావేశాలు ఈ నెల 20 నుంచి ప్రారంభం కావచ్చని చూచాయగా తెలుస్తోంది. ఇదే సమయంలో సమావేశాలకు ముందుగానే మంత్రివర్గ పునర్వ్యస్థీకరణ ఉంటుందని సమాచారం వస్తోంది. దీంతో ఎవరు ఉంటారు, ఎవరు పోతారన్న లెక్కల్లో ఎంపిలు ఉన్నారు. ఇది కూడా మోడీ, అమిత్ షాల కనుసన్నల్లోనే జరుగుతుందనడంలో సందేహం లేదు. అందుకే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంటే దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందుగానే ఈ మార్పులు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకొని, కొన్ని కీలక మంత్రిత్వ శాఖల్లో కొత్త నాయకులకు చోటు కల్పించడమే లక్ష్యంగా ప్రధాని మోడీ వ్యూహరచన చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. వరుసగా ప్రధాని మోడీ, అమిత్ షాలు వేర్వేరుగా రాష్ట్రపతిని కలవడం ఈ వార్తలకు బలం చేకూరింది. బీజేపీ సంస్థాగత బృందంలో కూడా నితిన్ నబిన్ నేతృత్వంలో సమూల మార్పులు చేసేందుకు పార్టీ అగ్ర నాయకత్వం జాబితాను ఖరారు చేసింది. ప్రభుత్వంతో పాటు పార్టీలో కూడా సమర్థులైన వారికి బాధ్యతలు అప్పగించే దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వ పనితీరును మరింత వేగవంతం చేసేందుకు పలువురు మంత్రుల శాఖల్లో మార్పులు ఉండబోతున్నాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విద్యాశాఖ బాధ్యతలు అప్పగించి, ఆ స్థానంలో శక్తికాంత దాస్‌ను తీసుకురావచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అనురాగ్ ఠాకూర్ తిరిగి మంత్రివర్గంలోకి వచ్చే అవకాశం బలంగా ఉంది. పరీక్షల లీకేజీలు, ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో సమర్థవంతమైన నాయకత్వం అవసరమని ప్రధాని భావిస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ధర్మేందర ప్రధాన్‌ను తప్పించే అవకాశాలు కూడా లేకపోలేదు. మరోవైపు పంకజ్ చౌదరి, హర్ష్ మల్హోత్రా వంటి మంత్రులు పార్టీ సంస్థాగత బాధ్యతల్లోకి వెళ్లగా, జార్జ్ కురియన్, రవ్‌నీత్ సింగ్ బిట్టు స్థానాల్లో కొత్త ముఖాలను కేబినెట్లోకి తీసుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్,పంజాబ్ రాష్ట్రాల నుంచి మరికొందరు సమర్థ నేతలను మంత్రివర్గం లోకి తీసుకునే అవకాశం ఉంది. బెంగాల్‌లో మెరుగైన ఫలితాలు సాధించిన నేపథ్యంలో అక్కడి ఎంపీలకు ప్రాధాన్యత దక్కవచ్చు.




శివసేన రెబెల్ వర్గం నుంచి ఒకరిద్దరికి, ముఖ్యంగా శ్రీకాంత్ షిండేకు అవకాశం లభించవచ్చని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఆప్ రెబెల్ ఎంపీలు రాఘవ్ చద్దా లేదా అశోక్ మిట్టల్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. రానున్న రోజుల్లో జరగనున్న కీలక రాజకీయ పరిణామాల నేపథ్యంలో, ఈ మార్పులు దేశ రాజకీయాలపై ప్రభావం చూపనున్నాయి. కేంద్రంలో ఎన్డీఏ సర్కార్ త్వరలో కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించే అవకాశం ఉండడంతో ఉభయ తెలుగురాష్ట్రాల్లోనూ మార్పులు ఉండవచ్చు.ముఖ్యంగా తెలంగాణలో ఉన్న ఇద్దరిలో మార్పు ఉంటుందా అన్న చర్చకూడా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్‌కు మరో కేంద్రమంత్రి పదవి దక్కనుందనే వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే టిడిపి నుంచి ఇద్దరు, బిజెపి నుంచి ఒక్కరు కేబినేట్‌లో ఉన్నారు. ఇప్పటికే ఏపీ నుండి ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ, మరో అదనపు పదవిని టీడీపీకి కేటాయించే యోచనలో బీజేపీ ఉన్నట్లు సమాచారం. ఏపీలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి బలంగా ఉండటంతో, కేంద్రంలో మరిన్ని అవకాశాలు దక్కేలా చంద్రబాబు వ్యూహరచన చేస్తున్నారు. ఒకవేళ మూడో పదవి వస్తే, అది టీడీపీ ఖాతాలోకే వెళ్తుందా లేక జనసేనకు వెళు తుందా, లేక బిజెపికే వెళుతుండా అన్నది చూడాలి. పరిణామం రాష్ట్ర అభివృద్ధికి, కేంద్రంతో సత్సంబంధాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని పార్టీ నేతలు ఆశిస్తున్నారు. మరోవైపు, సామాజిక సమీకరణాలను బట్టి నిర్ణయం తీసుకుంటే పరిస్థితి మారవచ్చు. మహిళా కోటాలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పేరును కూడా అధిష్టానం పరిశీలించే అవకాశం ఉంది. కొత్త వారికి అవకాశం ఇస్తారా లేదా అనుభవజ్ఞుల వైపు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి. బిజెపికే ఇస్తే మహిళా ఎంపి పురంధేశ్వరికి ఛాన్స్ దక్కవచ్చని అనుకుంటున్నారు. ఒకవేళ ప్రాంతీయ సమతుల్యత పాటిస్తే, ఉత్తరాంధ్ర లేదా రాయలసీమ ప్రాంతాలకు ప్రాధాన్యత పెరిగే ఛాన్స్ ఉంది. మంత్రి పదవి దక్కితే ఏపీకి కేంద్ర నిధులు, ప్రాజెక్టుల విషయంలో మరిన్ని ప్రయోజనాలు చేకూరతాయని పార్టీ భావిస్తోంది. మొత్తంగా ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలు, మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లుల వ్యవహారంతో పాటు మంత్రివర్గ విస్తరణ అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా ఉంది. రానున్న రోజుల్లో దీనిపై స్పష్టత రానుంది. బిజెపి వ్యూహం ఎలా ఉందన్నది కూడా తెలియనుంది.

# ప్రమాదంలో తక్షశిల పురావస్తు సంపద

**ఆందోళన వ్యక్తం చేసిన యునెస్కో**

**అక్కడ చేపట్టిన పనులను ఆపాలని పాక్‌కు ఆదేశం**

**ఇస్లామాబాద్,జూలై3:** అవిభక్త భారతదేశంలో తక్షశిల ఓ విశ్వవిద్యాలయం. ఆర్య చాణక్యుడు అక్కడ ఏర్పటు చేసిన విశ్వవిద్యాలయం అప్పట్లోనే ప్రపంచ ప్రసిద్ధి గాంచింది. అయితే భారత్‌పై విదేశీ దండయాత్రల్లో దీనిని కూడా ధ్వంసం చేశారు. చివరు దేశ విభజనలో అది పాక్ భూభాగంలోకి వెళ్లింది. ఇప్పుడు అక్కడి పురావస్తు సంపద ప్రమాదంలో పడిందని యునెస్కో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పాకిస్థాన్‌లోని ప్రాచీన పురావస్తు క్షేత్రం తక్షశిలలో ప్రభుత్వం చేపట్టిన సంరక్షణ పనులపై యునెస్కో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రపంచ వారసత్వ జాబితాలో ఉన్న ఈ చారిత్రక కట్టడాల్లో చేపట్టిన పనులు అసలు నిర్మాణాల ప్రామాణికత, చారిత్రక విలువను దెబ్బతీసేలా ఉన్నాయని హెచ్చరించింది. ఈ మేరకు పనులను వెంటనే నిలిపివేయకపోతే తక్షశిలను 'వరల్డ్ హెరిటేజ్ ఇన్ డేంజర్' జాబితాలో చేర్చడంతో పాటు, అవసరమైతే ప్రపంచ వారసత్వ హోదానూ రద్దు చేస్తామని పాకిస్థాన్ అధికారులను హెచ్చరించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలువడ్డాయి. పంజాబ్ ప్రావిన్స్‌లోని రావల్పిండి జిల్లాలో ఉన్న తక్షశిల.. దక్షిణాసియాలోనే అత్యంత ప్రాచీన బౌద్ధ విద్యా కేంద్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. మెసోలిథిక్ కాలానికి చెందిన గుహ, నాలుగు ప్రాచీన పట్టణాల అవశేషాలు, బౌద్ధ విహారాలు, మసీదు, మదరసా వంటి నిర్మాణాలతో ఈ ప్రాంతం విశేష చారిత్రక ప్రాధాన్యం కలిగి ఉంది. భారత ఉపఖండంలోని పట్టణ నాగరికత అభివృద్ధికి తక్షశిల ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోందని యునెస్కో




పేర్కొంటోంది. ఈ ఏడాది మార్చిలో ఓ సందర్శకుడు తక్షశిలలో జరుగుతున్న పనులకు సంబంధించిన ఫొటోలు, వివరాలను ప్యారిస్‌లోని పాకిస్థాన్ శాశ్వత ప్రతినిధి కార్యాలయానికి పంపించాడు. అసలు రాతి గోడలను తొలగించి కొత్త నిర్మాణాలు చేపట్టడం, పాత గోడల ఎత్తు పెంచడం వంటి చర్యలు చారిత్రక కట్టడాల ప్రామాణికతకు విఘాతం కలిగిస్తున్నాయని ఆయన ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులతో జూన్ 12న యునెస్కో ప్రతినిధులు, పాకిస్థాన్ పురావస్తు శాఖ, జాతీయ వారసత్వ మంత్రిత్వ శాఖ అధికారులు కలిసి తక్షశిల మ్యూజియాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మొహ్రా మొరాడు, సిర్కాప్ ప్రాంతాల్లో చేపట్టిన పనులకు సంబంధించిన పూర్తి సాంకేతిక పత్రాలను పంజాబ్ పురావస్తు శాఖ సమర్పించలేక పోయినట్లు సమాచారం. అంతేకాకుండా ప్రపంచ వారసత్వ కట్టడాల గోడలను సిమెంట్‌తో నిర్మించడం, పురాతన గోడల స్థానంలో కొత్త రాతి నిర్మాణాలు చేపట్టడం, గోడల ఎత్తును పెంచడం వంటి చర్యలు యునెస్కో నిబంధనలకు విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు. పాత రాళ్లకు, కొత్త నిర్మాణ సామగ్రికి మధ్య స్పష్టమైన తేడా కనిపిస్తోందని తెలిపారు. ప్రపంచ వారసత్వ కట్టడాల్లో ఇటువంటి మార్పులు చేయడం తీవ్ర ఉల్లంఘనగా పరిగణిస్తామని యునెస్కో స్పష్టం చేసింది. దీంతో తక్షశిల ప్రపంచ వారసత్వ హోదా ప్రమాదంలో పడే అవకాశం ఉందని, ఇదే పరిస్థితి కొనసాగితే 'డేంజర్ లిస్ట్'లో చేర్చడంతో పాటు అవసరమైతే జాబితా నుంచి పూర్తిగా తొలగించే అవకాశమూ ఉందని హెచ్చరించింది. ప్రస్తుతం మరో 24 చారిత్రక ప్రాంతాలకు ప్రపంచ వారసత్వ హోదా పొందేందుకు పాకిస్థాన్ చేస్తున్న ప్రయత్నాలపైనా ఈ వివాదం ప్రతికూల ప్రభావం చూపే అవకాశముందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ ఆరోపణలను పంజాబ్ పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ మాలిక్ జహీర్ అబ్బాస్ ఖండించారు. ప్రస్తుతం జరు గుతున్నవి 'పునర్నిర్మాణ పనులు కావు.. సంరక్షణ చర్య లు మాత్రమే' అని ఆయన స్పష్టం చేశారు. శిథిలా వస్థకు చేరుతున్న నిర్మాణాలను మరింత దెబ్బతిన కుండా కాపాడటం, వాటి అసలు స్వరూపాన్ని సంరక్షించడమే లక్ష్యమని చెప్పారు. ఈ మేరకు చేపట్టిన పనులను వెనక్కి తీసుకోవాల్సిన అవసరం లేదని పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ మాలిక్ జహీర్ అబ్బాస్ పేర్కొన్నారు.

# నేడు అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం

**- జూలై4న 13 రాష్ట్రాల సమాహారంగా అమెరికా ఏర్పాటు**



**వాషింగ్టన్,జూలై3:** అగ్రరాజ్యం అమెరికా జూలై4న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటోంది.అమెరికాకు 1776లో స్వాతంత్ర్యం లభించింది. మరి అంతకుముందు అది ఒకే దేశంగా ఉండేది కాదు! బ్రిటిష్ పాలనలోని 13 వలస రాజ్యాల సమాహారంగా ఉన్న ప్రాంతం తదుపరి ప్రత్యేక దేశంగా, అమెరికాగా అవతరించింది. 'ప్రాతినిధ్యం లేనిదే పన్ను లేదు' అనే నినాదంతో ఈ రాజ్యాలన్నీ బ్రిటిష్ పాలనకు ఎదురు తిరిగాయి. చివరకు 1776 జులై 4న పదమూడు వలస రాజ్యాలు స్వాతంత్ర్యం ప్రకటించుకొని.. అన్నీ కలిసి అమెరికాగా అవతరించాయి. అమెరికాలో ప్రస్తుతమున్న రాష్ట్రాల సంఖ్య 50. కానీ స్వాతంత్ర్యం వచ్చేనాటికి అట్లాంటిక్ తీరంలోని 13 రాష్ట్రాలు మాత్రమే అందులో భాగంగా ఉండేవి. అనేక కొనుగోళ్లు, యుద్ధాలు, ఒప్పందాలతో మిగతా రాష్ట్రాలను వాషింగ్టన్ దక్కించుకుంది. 1803లో ఫ్రాన్స్ నుంచి లూసియానాను కొనుగోలు చేసింది. దాంతో దేశ భూభాగం దాదాపు రెట్టింపైంది. 1819లో స్పెయిన్ నుంచి ఫ్లోరిడా దక్కింది. టెక్సాస్ తొలుత స్వతంత్ర దేశంగా ఏర్పడి.. 1845లో అమెరికాలో విలీనమైంది. మెక్సికోతో యుద్ధం తర్వాత అమెరికాలో కాలిఫోర్నియా, ఆరిజోనా, నెవాడా, ఉటా చేరాయి. 1867లో రష్యా నుంచి అలాస్కాను కొనుగోలు చేశారు. 1959లో హవాయి 50వ రాష్ట్రంగా మారింది. భౌగోళిక విస్తరణెళి అమెరికా ఆర్థిక, సైనిక శక్తికి పునాది అయింది. దేశానికి విస్తారమైన వ్యవసాయ భూములు, ఖనిజ సంపదతో పాటు రెండు మహాసముద్రాలపై ఆధిపత్యాన్ని కట్టబెట్టింది. అమెరికా 1861–65 మధ్య అంతర్యుద్ధంతో అతలాకుతలమైంది. బానిసత్వమే అందుకు ప్రధాన కారణం. దక్షిణ రాష్ట్రాల వ్యవసాయం ఆఫ్రికన్ బానిసల శ్రమపై ఆధారపడగా.. ఉత్తర రాష్ట్రాలు పారిశ్రామికీకరణ వైపు వెళ్లి బానిసత్వాన్ని వ్యతిరేకించాయి. ఈ విభేదాలు దేశాన్ని రెండు శిబిరాలుగా చీల్చాయి. అబ్రహాం లింకన్ అధ్యక్షుడిగా ఎన్నికవడంతో 11 దక్షిణ రాష్ట్రాల విడిపోయి ప్రత్యేక సమాఖ్యను ఏర్పాటుచేశాయి. అంతర్యుద్ధంలో ఆరు లక్షల మందికిపైగా మరణించారు. 1863లో లింకన్ బానిసల విముక్తి ప్రకటన జారీ చేయడంతో అంతర్యుద్ధం.. స్వేచ్ఛ కోసం పోరాటంగా మారింది. ఉత్తర రాష్ట్రాల విజయంతో బానిసత్వం రద్దయింది. అయితే జాతి వివక్ష వెంటనే అంతరించిపోలేదు. సమాన హక్కుల కోసం నల్లజాతీయులు మరో శతాబ్దం పాటు పోరాడాల్సి వచ్చింది. అయినప్పటికీ అంతర్యుద్ధమే అమెరికాను శాశ్వతంగా ఏకీకృత దేశంగా నిలబెట్టిందని చెప్పొచ్చు. అందుకే చరిత్రకారులు దీనిని అమెరికా రెండో జననంగా పిలుస్తారు. ఇలా దేశం విస్తరించడానికి అప్పటి నాయకుల కృషి ఎనలేనిది. ఇప్పుడు ట్రంప్ కూడా రాజ్య విస్తరణ కాంక్షను వదులుకోవడం లేదు.

# పశ్చిమాసియా సంక్షోభంలో రహస్యాలు

**ఇరాన్ నేతలను మట్టుపెట్టాలనుకున్న ఇజ్రాయిల్**

**అమెరికా రంగంలోకి దిగడంతో తప్పిన ముప్పు**

**న్యూయార్క్ టైమ్ కథనం వెల్లడి**

**వాషింగ్టన్,జూలై3:** పశ్చిమాసియా సంక్షోభంలో సరికొత్త అంతర్జాతీయ రహస్యాలు వెలుగులోకి వచ్చాయి. ఇవి.. అమెరికా, ఇజ్రాయెల్ మైత్రి బీటలు వారిందని చెప్పేందుకు మరింత ఊతమిచ్చేలా ఉన్నాయి. ఇరాన్ అగ్రనేతలు, శాంతి చర్చల ప్రతినిధులైన విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘెర్ గాలిబాఫ్ లపై ఇజ్రాయెల్ వేసిన 'హత్య ప్రణాళిక' ను అమెరికా ముందే పసిగట్టి, ఇరాన్‌ను అప్రమత్తం చేయడం ద్వారా వారి ప్రాణాలను కాపాడినట్లు ఓ నివేదిక వెల్లడించింది. ప్రముఖ అంతర్జాతీయ పత్రిక 'ది న్యూయార్క్ టైమ్స్'ఈ రక్షణ రహస్యాలను బహిర్గతం చేసింది. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీని ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో హతమార్చిన తర్వాత, ఇరాన్ ఉన్నత స్థాయి నాయకత్వాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలని ఇజ్రాయెల్ వ్యూహం రచించింది. అయితే, ఏప్రిల్ 8న జరిగిన మొదటి తాత్కాలిక కాల్పుల విరమణ తర్వాత అమెరికాతో అణు, శాంతి చర్చలు జరపడానికి ఇరాన్ తరఫున అరాగ్చీ, గాలిబాఫ్ బాధ్యతలు చేపట్టారు. ఇది ఇజ్రాయెల్‌కు ససేమిరా ఇష్టం లేదు.న్యూయార్క్ టైమ్స్ నివేదిక ప్రకారం.. ఏప్రిల్ 12న ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలిబాఫ్ పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్‌తో చర్చలు ముగించుకుని తిరిగి ఇరాన్‌కు విమానంలో ప్రయాణమయ్యారు. గాలిబాఫ్ ప్రయాణిస్తున్న విమానాన్ని కూల్చివేయడానికి ఇజ్రాయెల్‌కు చెందిన రెండు ఫైటర్ జెట్స్ ఇరాక్ మీదుగా ఇరాన్ వైమానిక పరిధిలోకి ప్రవేశించాయి. ఈ నిఘా సమాచారాన్ని అమెరికా ఇంటెలిజెన్స్ ముందే గుర్తించి, ప్రాంతీయ దేశాల (పాకిస్థాన్, ఖతార్) మధ్యవర్తుల ద్వారా ఇరాన్ ప్రభుత్వానికి అత్యవసర హెచ్చరికలు పంపింది. సమాచారం అందిన వెంటనే ఇరాన్ రక్షణ దళాలు గాలిబాఫ్ విమానాన్ని



టెహ్రాన్‌కు వెళ్లకుండా దారి మళ్లించి, ఈశాన్య ప్రాంతంలోని 'మషద్' నగరంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేయించాయి. ఆ తర్వాత గాలిబాఫ్ రోడ్డు మార్గంలో సురక్షితంగా టెహ్రాన్ చేరుకున్నారు. ఇరాన్‌తో శాంతి చర్చలు జరుపుతున్న సమయంలో ఆ దేశ ప్రధాన దౌత్యవేత్తలను ఇజ్రాయెల్ హతమరిస్తే, చర్చలు పూర్తిగా దారి తప్పి, అమెరికా కూడా నేరుగా ఇరాన్‌తో పెద్ద ఎత్తున యుద్ధంలోకి దిగాల్సి వస్తుందని వాషింగ్టన్ భయపడింది. 'వారినీ చంపేస్తే ఇక మనం శాంతి చర్చలు జరపటానికి ఇరాన్‌లో ఒక్క నేత కూడా మిగలడు' అని పాకిస్థాన్ దౌత్యవేత్తలు కూడా అమెరికాకు స్పష్టం చేశారు. దీంతో అమెరికా స్వయంగా రంగంలోకి దిగి ఇజ్రాయెల్‌ను వెనక్కి తగ్గాలని ఆదేశించిందని కూడా సదరు నివేదిక వెల్లడించింది. ఇదిలా ఉంటే, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలిబాఫ్ ప్రాణాపాయం నుంచి తప్పించుకోవడం ఇదే మొదటిసారి కాదు. జూన్ 2025లో జరిగిన 12 రోజుల యుద్ధంలో, అలాగే ఈ ఏడాది జరిగిన ఘర్షణల్లో ఇరాన్ భూగర్భ బంకర్లపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల శిథిలాల నుంచి గాలిబాఫ్ రెండుసార్లు ప్రాణాలతో బయటపడ్డారు.ఇక, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు మధ్య ఇటీవల కాలంలో తీవ్రమైన విభేదాలు రావడానికి ఈ ఘటనే పునాది అని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతేకాదు, ఇజ్రాయెల్‌కు ఇష్టం లేకపోయినప్పటికీ, అమెరికా.. ఇరాన్‌తో విడిగా చర్చలు జరిపి 14 అంశాల అవగాహనా ఒప్పందం కుదుర్చుకోవడం అంతర్జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

## కుటుంబ సమేతంగా కొండగట్టు అంజన్నను దర్శించుకున్న జగిత్యాల ఎస్పీ అశోక్ ఐపీఎస్




**జగిత్యాల** జిల్లా ఎస్పీ అశోక్ కుటుంబ సమేతంగా శుక్రవారం కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఘన స్వాగతం పలికారు.అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ స్థానాచారి కపిందర్ వేదాశీర్వచనం అందించగా, ఆలయ ఈఓ ఎస్ అంజనారెడ్డి శేష వస్త్రాలను అందజేసి సత్కరించారు.ఈ కార్యక్రమంలో సునీల్ ,చంద్రశేఖర్ సుపేరెండేంట్ ల తో పాటుగా మాల్యాల సిఐ ఎసై లు ఉన్నారు.ద

## కేంద్ర మంత్రి బండి సంజయ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన తిమ్మాపూర్ బీజేపీ నేతలు.



**తిమ్మాపూర్, జూలై 3:** తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీ (మహాత్మానగర్)లోని మహిళా శిశు వికాస కేంద్రంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శుక్రవారం పర్యటించారు. లోగోడ సి ఎస్ ఆర్ నిధులతో మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోలను అందించిన సందర్భంగా మహిళా వికాస కేంద్రం యంత్రాంగం చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ సీఎస్ఆర్ నిధులతో కొనుగోలు చేసిన ఉచిత కుట్టు మిషన్లను శుక్రవారం రోజున మహిళ లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమం సందర్భంగా తిమ్మాపూర్ మండల బీజేపీ నాయకులు కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. మంత్రిని కలిసిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర, తిమ్మాపూర్ మండల అధ్యక్షులు చింతం శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి, బూట్ల శ్రీనివాస్, మవురుపు సంపత్, కొయ్యడ శ్రీనివాస్, ఎర్రోజు లక్ష్మణాచారి, బుర్ర శ్రీనివాస్ గౌడ్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, ఓదెలు, దురిశెట్టి రమేష్, సుగుణాకర్, భూమ్ రెడ్డి, బీజేవైఎం నాయకులు దురిశెట్టి అజయ్, ప్రేమ్ చంద్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు.




**కరీంనగర్,** ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందజేశారు. అనంతరం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శాలువాతో మహేష్ కుమార్ గౌడ్‌ను సత్కరించారు.ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, యావత్ తెలంగాణతో పాటు పొరుగు రాష్ట్రాల ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆరాధించే కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని తాను ఎన్నోసార్లు దర్శించుకున్నానని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండున్నరేళ్లుగా పేద ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ప్రజాసంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా కొనసాగించేలా స్వామివారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.కొండగట్టు ఆలయ మాస్టర్ ప్లాన్ అంశాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తున్నారని, త్వరలోనే మాస్టర్ ప్లాన్ అమలులోకి వచ్చి ఆలయ అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, నరేందర్ రెడ్డి లతోపాటుగా ఆలయ ఈఓ ఎస్ అంజనారెడ్డి ,సుపేరెండేంట్ సునీల్ టెంపుల్ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ళ అశోక్ లు ఉన్నారు .

## ఐ.ఎఫ్.టి.యూ నెల్లూరు జిల్లా 3వ మహాసభలకు సర్వం సిద్ధం

**జూలై 15న గూడూరులో మహా సభ**

**కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరుకు పిలుపు**




**నెల్లూరు** ఐ.ఎఫ్.టి.యూ జిల్లా 3వ మహాసభలు జూలై 15న గూడూరు పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనం వేదికగా ఘనంగా జరగనున్నాయని, ఈ సభను జయప్రదం చేయాలని ఐ.ఎఫ్.టి.యూ జిల్లా గౌరవ అధ్యక్షులు డి.పి. పోలయ్య కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. శు క్రవారం సైదాపురంలో మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 4 లేబర్ కోడ్స్ కార్మికుల హక్కులను కాలరాసేలా ఉన్నాయని, వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థలను ప్రోత్సహించడం ద్వారా కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని, కార్మికోద్యమాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ మహాసభకు కార్మికులందరూ అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె. చెంగళరావు, నాయకులు కె. మస్తానయ్య, డి. నవకోటి, ఎం. అనీల్, పి. వెంకటరమణయ్య, పి. రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**(04 జూలై "అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం" సందర్భంగా)**

ఇంగ్లాండ్ పాలనలో ఉన్న అమెరికా సంయుక్త రాష్ట్రాల ప్రజలు చేపట్టిన అమెరికన్ విప్లవ పోరాటం ఫలితంగా 04 జూలై 1776న స్వాతంత్ర్య పొంది స్వేచ్ఛ వాయువులు పీల్చుకోవడం జరిగింది. ఈ మహాఘట్టాన్ని పురస్కరించుకొని 04/05 జూలై రోజున అమెరికాలోని 50 రాష్ట్రాలు సెలవు దినాన్ని పాటిస్తూ, 1812లో జరిగిన యుద్ధం అనంతరం "యూఎస్ ఇండిపెండెన్స్ డే" లేదా "అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం" ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. 1870 తర్వాత స్వాతంత్ర్య దినోత్సవం రోజున వేతనంతో కూడిన సెలవు దినం ప్రకటించబడింది. ఈ ఉత్సవాల్లో భాగంగా కవాతులు, వినోద కార్యక్రమాలు, సభలు, సమావేశాలు, క్రీడలు, కుటుంబ కలయికలు, బాణాసంచా వెలుగులు, విహార యాత్రలు లాంటి వేడుకల్లో ప్రతి ఒక్కరు పాల్గొంటారు. 1776కు పూర్వం అమెరికాకు చెందిన 13 కాలనీలు బ్రిటీష్‌కు చెందిన కింగ్ జార్జ్–3 చక్రవర్తి పాలనలో ఉండేవి. అమెరికన్ల స్వాతంత్ర్య పోరాట ఫలితంగా 02 జూలై 1776న స్వాతంత్ర్య ప్రకటన చేసినప్పటికీ 04 జూలైన మాత్రమే సంతకాలు చేయడంతో అదే రోజున అమెరికన్లు తమ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

యూఎస్ జాతి పిత 'జార్జ్ వాషింగ్టన్":

స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ చక్రవర్తి పాలనలో అమెరికన్లు దుర్భరమైన బానిస బతుకులు గడపడంతో జార్జ్ వాషింగ్టన్ నేతృత్వంలో పెద్ద ఎత్తున పోరాటాలు, ఉద్యమాలు జరగాలని చరిత్ర స్పష్టం చేస్తున్నది. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత అమెరికన్లు తమదైన రాజ్యాంగంతో తొలి అధ్యక్షుడిగా 1789 – 97 మధ్య జార్జ్ వాషింగ్టన్ ఎంపిక కావడం,పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోవడంతో జార్జ్ వాషింగ్టన్‌ను "అమెరికా సంయుక్త రాష్ట్రాల జాతి పిత (ఫాదర్ ఆఫ్ యూఎస్)"గా గౌరవం ఇవ్వడం జరిగింది. తనకంటూ ఒక రాజ్యాంగం లేకుండానే 1776 నుంచి 1789 వరకు ఎనిమిది మంది అధ్యక్షులుగా సేవలు అందించినప్పటికీ 1987లో ఏర్పడిన అమెరికా రాజ్యాంగ రచన కమిటీకి జార్జ్ వాషింగ్టన్ చైర్మన్‌గా వ్యవహరించి ప్రధాన భూమిక నిర్వహించారు.

స్వాతంత్ర్యం పొందిన అమెరికాకు 48వ అధ్యక్షుడిగా నేడు డొనాల్డ్ ట్రంప్ వివాదాస్పద రీతుల్లో విదేశాంగ విధాన నిర్ణయాలు తీసుతోవడంతో పాటు అనవసర యుద్ధాలకు కాలుదువ్వుతూ అభాసుపాలు కావడం చూస్తున్నాం. జార్జ్ వాషింగ్టన్ ప్రభుత్వం 1792లో వైట్ హౌజ్ నిర్మాణం ప్రారంభించగా 1800లో జాన్ ఆడమ్స్ అధ్యక్షుడి కాలంలో పూర్తి కావడం, పాలనకు అందుబాటులోకి రావడం జరిగింది.

నేడు 250వ స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకుంటున్న అమెరికన్లకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేద్దాం.

ఆచార్య: బుర్ర మధుసూదన్ రెడ్డి

# ప్రపంచ శాంతి సాధనలో సహకార సంఘాలు

**(జూలై 04న "అంతర్జాతీయ సహకార దినోత్సవం" సందర్భంగా)**

"అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని" 1923 నుండి ప్రపంచవ్యాప్తంగా గ్లోబల్ కోఆపరేటివ్ మూవ్‌మెంట్ చొరవతో జరుగుతూ వస్తోంది. ఐక్యరాజ్యసమితి (ఖచీూ) కూడా 1995 నుండి దీనిని పాటిస్తోంది. ఇది జూలై నెల మొదటి శనివారం, అనగా 04 జూలై 2026న నిర్వహించబడుతుంది. 2026లో, అంతర్జాతీయ సహకార దినోత్సవం 104వ వేడుకగా, 32వ ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సహకార దినోత్సవంగా నిలిచింది. సుస్థిర అభివృద్ధికి సహకార సంఘాలు అందించే తోడ్పాటుపై అవగాహన పెంచడానికి మరియు ఐక్యరాజ్యసమితికి, అంతర్జాతీయ సహకార ఉద్యమానికి మధ్య సహకారాన్ని బలోపేతం చేయడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న సహకార సంఘాలు, ప్రభుత్వాలు, భాగస్వాములు మరియు వాటాదారులను ఒకచోట చేర్చడమే ఈ దినోత్సవం యొక్క లక్ష్యం. సహకార సంఘాలు సంఘర్షణలు లేకపోవడానికి మాత్రమే కాకుండా, సానుకూల శాంతికి అవసరమైన పునాదులైన న్యాయం, సమ్మిళితత్వం మరియు విశ్వాసం ఉండటానికి కూడా దీర్ఘకాలంగా తోడ్పాటు అందిస్తున్నాయి. ప్రపంచ సహకార ఉద్యమం అధికారికంగా 1844లో ఇంగ్లాండ్‌లో ప్రారంభమైంది.

అంతర్జాతీయ సహకార దినోత్సవం–2026 యొక్క ఇతివృత్తం:

ప్రపంచవ్యాప్తంగా సామాజిక న్యాయం, సమ్మిళితత్వం మరియు సంఘీభావాన్ని పెంపొందించడంలో సహకార సంస్థల కీలక పాత్రను హైలైట్ చేస్తూ, ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సహకార దినోత్సవం–2026 యొక్క ఇతివృత్తాన్ని "శాంతియుత ప్రపంచం కోసం సహకార సంస్థలు"గా అధికారికంగా ప్రకటించారు. ప్రజాస్వామ్య భాగస్వామ్యం, ఆర్థిక సమ్మిళితత్వం, సామాజిక స్థితిస్థాపకత మరియు సుస్థిర అభివృద్ధిని ప్రోత్సహించడం ద్వారా శాంతియుత సమాజాల నిర్మాణానికి సహకార సంస్థలు ఎలా దోహదపడతాయో కూడా ఈ ఇతివృత్తం నొక్కి చెబుతుంది. సహకార సంస్థలు సమాజంలోని అన్ని వర్గాల వ్యక్తులను ఆర్థిక మరియు సామాజిక జీవితంలో పాల్గొనేలా చేస్తూ, అసమానతలను తగ్గించడానికి మరియు సమైక్యతను బలోపేతం చేయడానికి సహాయపడతాయి. శాశ్వత శాంతి అనేది సామాజిక న్యాయంపై ఆధారపడి ఉండాలనే చిరకాల సూత్రంతో కూడా ఈ ఇతివృత్తం బలంగా ప్రతిధ్వనిస్తుంది.రోజురోజుకు విచ్ఛిన్నమవుతున్న ప్రపంచంలో, సహకార సంస్థలు వారధులుగా పనిచేస్తూ, సమాజాలను ఏకతాటిపైకి తీసుకురావడం, సంభాషణలను ప్రోత్సహించడం, మరియు పునరుద్ధరణ, స్థితిస్థాపకతను బలోపేతం చేయడంలో వాటి పాత్రను ఈ ఇతివృత్తం నొక్కి చెబుతుంది.

భారతదేశంలో సహకార ఉద్యమం:

"సర్ ఫ్రెడరిక్ నికల్సన్"ను భారతదేశంలో సహకార ఉద్యమ మార్గదర్శకుడిగా మరియు "సహకార ఉద్యమ పితామహుడిగా" గుర్తిస్తారు. అయితే, ఈ బిరుదును రావు బహదూర్, ఎస్.ఎస్. తల్మాకి మరియు వైకుంఠభాయ్ ఎల్. మెహతా వంటి భారతీయ సంఘ సంస్కర్తలు కూడా తరచుగా పంచుకుంటారు. భారతదేశంలోని సహకార ఉద్యమం అనేది అట్టడుగు వర్గాల ప్రజలకు సాధికారత కల్పించే ఒక శతాబ్దపు పురాతన సామాజిక–ఆర్థిక వ్యవస్థ. పరస్పర సహాయం మరియు సభ్యుల యాజమాన్యం అనే స్ఫూర్తితో పనిచేస్తూ, ఇది వ్యవసాయం, దాయి మరియు గృహనిర్మాణం వంటి కీలక రంగాలను ముందుకు నడిపిస్తుంది. ప్రభుత్వం ప్రత్యేక సహకార మంత్రిత్వ శాఖ ద్వారా ఈ ప్రయత్నాలను పర్యవేక్షిస్తూ, ఆధునీకరిస్తుంది. గ్రామీణ దుస్థితి మరియు వడ్డీ వ్యాపారుల దోపిడీ నుండి పుట్టిన ఈ ఉద్యమాన్ని బ్రిటిష్ ప్రభుత్వం "సహకార పరపతి సంఘాల చట్టం, 1904" ద్వారా సంస్థాగతం చేసింది. స్వాతంత్ర్యానంతర కాలంలో, ప్రజాస్వామ్య ప్రణాళిక మరియు గ్రామీణాభివృద్ధికి ఒక సాధనంగా సహకార సంఘాలను పంచవర్ష ప్రణాళికలలో విలీనం చేశారు. ఆర్థిక చేరిక, సమ్మిళిత వృద్ధి మరియు సుస్థిర జీవనోపాధి అనేవి భారతీయ సహకార ఉద్యమం యొక్క ప్రధాన లక్ష్యాలు. భారత సహకార వ్యవస్థ ప్రధానంగా భౌగోళికంగా మరియు పరిధిని బట్టి రుణ సహకార సంఘాలు, రుణేతర సహకార సంఘాలు మరియు బహుళ రాష్ట్ర సహకార సంఘాలుగా విభజించబడింది. భారతదేశంలోని అగ్రగామి మూడు సహకార సంఘాలు అముల్, ఇఫ్కో మరియు క్రిబ్కో. భారతదేశంలోని ఇతర ప్రముఖ సహకార సంఘాలు కెసిఎమ్ఎమ్ఎఫ్, యుఎల్‌సిసిఎస్, కెఎమ్ఎఫ్, ఓఎమ్ఎఫ్ఇడి, సరస్వతి కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, బియుసిసిఎస్ మరియు నాఫెడ్. తెలంగాణ గ్రామీణ, వ్యవసాయ మరియు సామాజిక–ఆర్థిక అభివృద్ధికి, అలాగే రుణం, మార్కెటింగ్ మరియు సంక్షేమం వంటి వివిధ రంగాలలో దాని నిర్మాణాత్మక అభివృద్ధికి సహకార రంగం చాలా కీలకమైనది. ఈ ఉద్యమానికి టిఎస్‌సిఎబి (TSCAB) నాయకత్వం వహిస్తోంది. ముఖ్యమైన సహకార ప్రభుత్వ రంగ సంస్థలు (పిఎస్ఎసిఎస్), డిసిసిబిలు, టిఎస్‌డిడిసిఎఫ్, సహకార గృహ నిర్మాణ సంఘాలు, వినియోగదారు ꠲ సూపర్‌మార్కెట్ సహకార సంఘాలు, టిఎస్‌సిబ, టిజిడబ్ల్యుసిడిసి మరియు టిటిసిఎస్.

"అంతర్జాతీయ సహకార సంవత్సరం–2025" తర్వాత వస్తున్న అంతర్జాతీయ సహకార దినోత్సవం–2026, సమ్మిళిత అభివృద్ధికి, శాంతికి చోదకాలుగా సహకార సంస్థల పాత్రను బలోపేతం చేయడానికి, మరియు ప్రపంచవ్యాప్తంగా మరింత న్యాయమైన, సుస్థిరమైన సమాజాల దిశగా కార్యాచరణను సమీకరించడానికి ఒక ముఖ్యమైన అవకాశాన్ని అందిస్తుంది. సహకార సంస్థలు అనేవి సంఘీభావం, భాగస్వామ్యం మరియు సుస్థిర అభివృద్ధిలో పాతుకుపోయిన ప్రజాస్వామ్య యాజమాన్య నమూనాలు. ప్రజలు స్వేచ్ఛగా, సంఘీభావంతో ఏకమై, తాము ప్రజాస్వామ్యబద్ధంగా సొంతం చేసుకుని, పరిపాలించే సంస్థల ద్వారా తమ ఉమ్మడి అవసరాలను తీర్చుకోగలరనే ఒక సరళమైన కానీ శక్తివంతమైన ఆలోచనపై ఇవి ఆధారపడి ఉన్నాయి.

ఆచార్య : బుర్ర మధుసూధన్ రెడ్డి
9949700037

# ఘనంగా హజ్రత్ షేర్ అలిబాబా 63వ ఉర్సు ఉత్సవాలు

**ఘనంగా సందల్ మహోత్సవం..**

**సందల్, చాదర్ సమర్పించిన దివంగత హాజీరాబి వారసులు**

**దర్గా ను సందర్శించిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**




**కరీంనగర్, తిమ్మాపూర్, జూలై 02:-**అలుగునూర్ పరిధిలోని కరీంనగర్ శివారు కేబుల్ బ్రిడ్జి పక్కనే గల హాజరత్ షేర్ అలీ బాబా రహ్మాతుల్లా అలైహి 63వ ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి నగరంలో షాసాహబ్ మొహాల్ల నుండి స్థానిక ముస్లింలు, దర్గాహ్ వ్యవస్థాపకురాలు దివంగత హజ్రత్ హాజీరాబి, కుమారుడు హసన్ వారసుడైన అబ్దుల్ వసీం బారీ, ఫైజ్ ఖాన్ ఆధ్వర్యంలో ర్యాలీగా సందల్ గ్రంథ లేపనంతో పాటు ప్రత్యేక చాదర్ ను తీసుకెళ్లి హజ్రత్ షేర్ అలిబాబా రహ్మాతుల్లా అలైహి సమాధికి సందల్ పూసి, చాదర్ సమర్పించారు. అనంతరం కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం దర్గాను సందర్శించారు. సీపీ తో పాటు ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, మౌలాన అలీముద్దీన్ నిజామి, జామ మస్జిద్ అధ్యక్షుడు సయ్యద్ రియజోద్దీన్ ఖాద్రి, మౌలాన ఖయుమ్ జియాయి, సర్వే డిపార్ట్మెంట్ డిప్యూటీ ఇన్స్పెక్టర్ మొయిజ్, ఫహీం, వాజిద్, యూసుఫ్, ఉమర్, అమాన్, జమాల్, అర్మాన్, ఉస్మాన్, అలీం, ఫైజ్ లు దుఆ చేశారు. సయ్యద్ జకీయుద్దీన్ నదీమ్, సయ్యద్ నయీముద్దీన్ ఆధ్వర్యంలో బిర్యానీతో 2000 మంది ఉర్సుకు వచ్చిన ప్రజలకు అన్నదానం చేశారు. కరీంనగర్, మానకొండూర్, నుస్తులపూర్, ఎల్ఎండి కాలనీ, చింతకుంట ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు దర్గాహ్ ఉర్సు ఉత్సవాలకు పోటెత్తారు. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌస్ ఆలం కు, ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తో పాటు తిమ్మాపూర్ సిఐ బొల్లం రమేశ్ కు, తిమ్మాపూర్ ఎస్సై అన్వర్ లకు దర్గా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. తిమ్మాపూర్ పోలీసులు, కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా గూడూరు నియోజకవర్గంలో రూ. 24 లక్షల పంపిణీ**

**ఇప్పటివరకు రూ. 6.77 కోట్ల సాయం: ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**



**నెల్లూరు** రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన నాటి నుండి పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ స్పష్టం చేశారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో జరిగిన కార్యక్రమంలో 52 మంది బాధితులకు రూ. 24 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ?ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి గూడూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు రూ. 6 కోట్ల 77 లక్షల రూపాయలను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా బాధితులకు అందజేశామని వెల్లడించారు. గత ఐదేళ్ల పాలనలో పేదలకు కనీస సహాయం కూడా అందలేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తోందని, సీఎం రిలీఫ్ ఫండ్ అందుకున్న ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని గుర్తుంచుకోవాలని కోరారు.

బాధిత కుటుంబాలకు భరోసా..

కోట మండలం చంద్రశేఖరపురం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల కుటుంబాలను ఎమ్మెల్యే సునీల్ కుమార్ పరామర్శించారు. గురువారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో పార్టీ కార్యకర్తలు మృతి చెందడం పట్ల ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కోట ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న ఎమ్మెల్యే, మృతుల తల్లిదండ్రులను ఓదార్చారు. మరణించిన ప్రతి కార్యకర్త కుటుంబానికి రూ. 50 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆయా కుటుంబాలకు పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటాయని, బాధపడవద్దని భరోసానిచ్చారు.

## జులై 6న మంచిర్యాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నిజమైన ఉద్యమకారుల ప్రత్యేక సమావేశం

- తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్రచైర్మన్ ఆదేశాల మేరకు...
- టి యు వి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండలం కమిటీల ఆధ్వర్యంలో




**ఉమ్మడి ఆదిలాబాద్ :జులై 03** :తెలంగాణ రాష్ట్రం లోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ని మం చి ర్యాల నూతనంగా ఏర్పడిన జిల్లాలోతెలంగాణ నిజమైన ఉద్యమకారుల సమావేశం నిర్వహి స్తు న్నామని కమిటీలు ప్రకటనలు విడుదల చ ేశా రు. వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్య మ కా రుల వేదిక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమా వే శం జులై 6 ఉదయం 10 గంటలకు మం చి ర్యాల , పాత కలెక్టర్ కార్యాలయం దగ్గర , రాంనగర్ భవన నిర్మాణ సంఘం వద్ద , పార్టీ లకతీతంగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు ఆహ్వానితులే.తొలి దశ – మలి దశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒ క్కరూ స్వచ్ఛందంగా టి యు వి సమావేశానికి కార్యక్రమం విజయ వంతం చేయాలని,ప్రతి ఒక్కరికి తెలంగాణ ఉద్యమకారులకు తెలియ జేయలి.అందరు ఉద్యమకారులు ఆహ్వానితులే. అన్ని విద్యార్థి సంఘాలు, పలు జేఏసీ సంఘాలు వచ్చే విధంగా సహకరించాలని టి యు వి రాష్ట్ర కమిటీ,జిల్లా కమిటీ, నియోజకవర్గం కమిటీ, మండలకమిటీలు, టి యు వి సమావేశం కార్యక్రమం విజయవంతం చేయాలని, ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## జులై10న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

- విద్యాశాఖ మంత్రిని నియమించాలి..
- పిడిఎస్యు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మహేష్, మాగం లోకేష్

**గార్ల ::జులై 3:** గార్ల మండలం కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పిడిఎస్యు, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 10 న జ రిగే విద్యాసంస్థల బంధుని జయప్రదం చేయాలని నిరసన వ్యక్తం చేయడం జరిగింది. విద్యార్థుల సమస్యలను పూర్తిగా విస్మరించి, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలను అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఖరిని వెంటనే మార్చుకోవాలని పిడి ఎస్యు జిల్లా అధ్యక్షుడు మునగాల మహేష్ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాగం లోకేష్ డిమాండ్ చేశారు.గార్ల ప్రభుత్వ జూ నియర్ కళాశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ మరియు డిగ్రీ కళాశాల విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఎస్ ఎం హెచ్ హాస్టల్ ను




ఏర్పాటు చేయాలనీ డిమాండ్.రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అధ్యాపకుల ఖాళీలు భారీగా పేరుకుపోయినా భర్తీ చే యడం లేదు.సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం,ప్రైవేటీకరణకు ప్రోత్సాహం ఇస్తూ పేద విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చుతోంది.ఎన్నికల సమయంలో విద్యారంగ అభివృద్ధిపై అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరి ంచి ంది. విద్యార్థుల సమస్యలపై స్పందించకుండా కాలయాపన చేయడం దురదృష్టకరం.విద్య హక్కును కాపాడాల్సిన ప్రభుత్వం, విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తీవ్రంగా ఖండించదగిన విషయం.ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.

సంక్షేమ హాస్టళ్లలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పి ంచాలి. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి.ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి ప్రైవేటీకరణ విధానాలను నిలిపివేయాలి. జులై 10వ తేదీన తలపెట్టిన విద్యాసంస్థల బంద్ ను పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నితిన్,రాంబాబు, వంశీ పిడిఎస్యు నాయకులు సాగర్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సాయంత్రం వేళ రైతన్నలకు రైతక్కలకు ఋషి విద్య

**పార్వతీపురం మన్యం జిల్లా, పాంచాలి, జులై 3** కలియుగాబ్ది 5127 శాతవాహన శతకం 1948 ఉత్తరా యణం పరాభవ నామసంవత్సరం గ్రీష్మ ఋతువు వాస్తావ జేష్ఠ మాసం అనగా..తేదీ జూలై 1, 2026 బుధవారం రాత్రి 07 గంటలకు నుండి ప్రతి రామ మందిరంలో భారతనంద స్వామి జి యోగ నిపుణులు ఇందుమణి మాతాజి ఆశీర్వాదం ప్రార ంభం చేయడం జరిగింది..ఉదయం అంత శ్రమించి ఇంట్లో అలచట విశ్రాంతి సమయంలో..కాస్త సమయంజ్ఞాన విద్య,

భక్తి నేర్చుకోవాలి అంటూ పిలుపు నిచ్చారు భోధన అంశాలుసంతకం.. నేర్పటం ఇంట్లో పూజ విధానం ధ్యానం, శ్లోకం, మంత్రం, ఇంట్లో ఆరోగ్యంపిల్లలను క్రమశిక్షణలో పెట్టుట, భక్తి గీతం, జ్ఞాన గీతం,ఏ మహర్షి వీధిలో వున్నా పెద్దలు వాళ్ళు బాధ్యత వహించి ఈ ధర్మ కార్యక్రమం ముందుకు తీసుకొని వెళతారని సాటి స్థానికులను కోరారు..ప్రతి మందిరం గ్రంధాలయం ఏర్పాటు చేసి ఏ వీధికీ ఆ వీధే వాళ్ళు చేత పుస్తకాలు, ఇతిహాసాలు, వేదాలు,రామాయణం, మహాభారతం భగవద్గీత ఇంకా గరుడ పురాణం. భారత రాష్ట్ర చరిత్ర వంటి పుస్తకాలు సమాకుర్చుకోవాలి తెలియజేసారు.గ్రామం వ్యసనంకు లోన అవ్వకుండా ధర్మ మార్గంలో జీవనం కొనసాగాలని అన్నదే ముఖ్య లక్ష్యం మని కొనియాడారు.అలాగే వలస ప్రయాణం తగ్గించి



స్వావాలంబనాతో బ్రతకాలి అన్నదే దృఢ సంకల్పంతో ఋషి విద్య ఆవిష్కరణ జరిగింది..అంటూ కార్యక్రమం పూర్తి చేశారు అంటూ గ్రామ సంరక్షణ నిధి వ్యవస్థాపకులు పాంచాలి రామకృష్ణ మన లక్ష్యం దినపత్రిక జర్నలిస్ట్ సంతోష్ కుమార్ పాణిగ్రాహీ కు తెలిపారు.

## ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కు బిఆర్ఎస్ పార్టీ నాయకులు



**ఎల్బీనగర్ జూలై 03** :చంపాపేట్ డివిజన్ నగర్ కాలనీ నందు నిర్వహించిన ఎస్ఐఆర్ స్పెషల్ ఇం టె న్సివ్ రివిజన్ అవగాహన కార్యక్రమంలో బీఆ ర్ఎస్ నాయకులు పాల్గొని ప్రజలకు ఎస్ ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు సక్రమంగా నమో దు కావడానికి అవసరమైన పత్రాలను సమర్పి ంచాలని ఎవరికైనా సమస్యలు ఉంటే సంబ ంధిత ఎన్నికల అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన రాజ్యాంగ హక్కు అని ప్రతి ఒక్కరూ తమ ఓటు వివరాలను తప్పనిసరిగా పరిశీలించి అవసరమైన మార్పులు చేర్పులు చేయించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో భారస పార్టీ నాయకులు ఉమ మహేశ్వర్, అంజిరెడ్డి, శేఖర్ రెడ్డి, సురేందర్ రెడ్డి, రాజశేఖరరెడ్డి, కృష్ణ సాగర్, వెంకటేష్, బిఎల్ఓ లు పాల్గొన్నారు

## వనస్థలిపురం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అధ్యక్షుల తో సమావేశం


**ఎల్బీనగర్ జూలై 03** :ఎస్ఐఆర్ ప్రక్రియలో కాంగ్రెస్ బీఎల్ఏలు భాగస్వామ్యమయ్యేలా డివిజన్ అధ్యక్షులు బాధ్యత తీసుకొని పనిచేయాలని ఎస్ఐఆర్ ఎల్బీ నగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్, కల్లుగీత పారిశ్రామిక సహకార సంస్థ వైస్ ఛైర్మన్ కేశం నాగరాజు గౌడ్ పేర్కొన్నారు ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో వనస్థలిపురం పార్టీ కార్యా లయంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులతో నాగరాజు సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా నాగరాజు మాటా ్లడుతూ అర్హులందరూ ఓటర్లుగా నమోదయ్యేలా కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ లు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు ఇప్పటికే వారం రోజులు గడిచిపోయినందున బిఎల్ఓలతో అనుసం ధాన మై అర్హులందరూ నమోదు ఓటర్ నమోదు చేయించుకునేలా చూడాలన్నారు కాగా ఇప్పటికీ కొన్ని బూత్ లలో బీఎల్ఓ లు రావడంలేదని పలువురు డివిజన్ అధ్యక్షులు పేర్కొన్నారు ఈ విషయాన్ని ఎలక్షన్ కమిషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు ఎన్యుమరేషన్ ఫామ్ 6 ఫామ్ 7 తదితర ఫామ్స్ బీఎల్ఓ లు ఇవ్వటం లేదని ప్రజల నుంచి పిర్యాదులు వస్తున్నాయని ఈ విషయాలను కూడా ఈఆర్ఓ ఏఈఆర్ఓ ల దృష్టికి తీసుకుపోవాలన్నారు సమావేశంలో డివిజన్ల అధ్యక్షులు మకుటం సదశివుడు కుట్ల నర్సింహా యాదవ్ లింగాల కిషోర్



గౌడ్ వేణుగోపాల్ యాదవ్ శశిధర్ రెడ్డి మంజుల రెడ్డి బుడ్డా సత్యనారాయణ చెన్నగోని రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## బెజ్జూర్ మండల కేంద్రంలో ఎస్ ఐ ఆర్ 2026 అవగాహన సహాయ కేంద్రం ప్రారంభం

**కొమరంభీమ్ ఆసిఫాబాద్ :జులై 03,** :కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండల కేంద్రంలో ఎస్,ఐ, ఆర్ 2026 ప్రతి ఓటరుకు అవగాహన కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎ మ్మెల్సీ దండే విఠల్ ప్రారంభించారు.ఈ కార్య్ర కమంలో బి ఎల్ ఏ లు, పాల్గొని, ఓటరు న మోదు, సవరణలు,ఓటరు జాబితా సంబ ంధిత అంశాలపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అవగాహన కల్పిం చా రు. ఈ



కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయ కు లు బూత్ లెవెల్ ఏజెంట్లుతదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ ఎమ్మెల్సీ నాగబాబుతో తెలికాపు ఉమామహేశ్వరరావు భేటీ...




**పార్వతీపురం మన్యం జిల్లా నర్సిపురం జూలై 3** :పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రమైన పార్వతీపురం టౌన్ దగ్గరలో నర్సిపురం ప్రాంతంలో భాను కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ లో సాలూరు నియోజకవర్గం సారథులు సమాచార సేకరణ ప్రక్రియ లో భాగంగా ఎమ్మెల్సీ సభ్యులు కొణిదెల నాగబాబు తో సాలూరు కు చెందిన పార్వతీపురం మన్యం జిల్లా నాగవంశం జిల్లా కమిటీ అధ్యక్షులు తెలి కాపు ఉమామహేశ్వరరావు భేటీ అయ్యారు.... ఆయన మాట్లాడుతూ విజయనగరం లో నాగ వంశం కమ్యూనిటీ హాల్ ఉందని అదేవిధంగా పార్వతీపురం మన్యం జిల్లా లో సాలూరు ప్రాంతంలో కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు సహకరించాలని, అదేవిధంగా బీసీ 'డీ'గా ఉన్న నాగవంశం కులస్తులను బిసి' ఏ' గా మార్చాలని, కూటమి ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు వినతిపత్రం అందించవలసినదిగా ఎమ్మెల్సీ నాగబాబు కు అందించారు. దాంతోపాటు నాగవంశం సంఘ అభివృద్ధికి పలు చర్చలు జరిపారు. మాజీ కేంద్ర పర్యాటక మంత్రి మెగాస్టార్ చిరంజీవి తమ్ముడు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అన్న... ఎమ్మెల్సీ నాగబాబు సానుకూలంగా స్పందించినట్టు మన లక్ష్యం న్యూస్ తో పంచుకున్నారు.

## పక్కృతిని పూజించే పండుగ సిత్లా

- ప్రాచీన కాలం నుండి తండాల్లో కొనసాగుతున్న ఆచారాలు
- ఈ నెల 7వ తేది మంగళవారం ఉత్సవాలు జరుపుకొనుటకు సిద్ధమైన బంజారాలు

**గార్ల:: జులై 3 :** నంగారా బేరి లంబాడి హక్కుల పోరాట సమితిమహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు ధరావత్ కిషన్ నాయక్ శీత్ల పండుగను గిరిజన లంబాడీలు ఒకే రోజు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. గిరిజనులు పశువు రక్షణ కోసం వర్షాలు వసంతకాలంలో కురిసిన వర్షానికి పంటలు బాగా పండాలని ప్రాచీన కాలం నుండి జరుపుకునే పండగ సిత్లా ఉత్సాహాలు, ఈ మేరకు గోరు బంజారాలు ప్రత్యేక భక్తి శ్రద్ధలతో జరుగుతారు. వర్షాకాల ప్రారంభం కాలంలో పెద్దపుశాల కార్తీ గిరిజన తండాల్లో సిత్లా పండగ సందడి సందడిగా కనిపిస్తాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు అన్ని గిరిజన తెగల లోను ఈ పండగ జరుపుకోవడం విశేషం, స్థానికంగా ఏ పండుగను దాటుడు పండగ,సిత్లా భవాని పండుగగా పిలుస్తారు. లాలీలతో పశువుల పోషణకు మారుపూరైన గిరిజనులు పూర్వకాలం నుంచి వందల సంఖ్యలో పశువు సంపదను కలిగి ఉండేవారు, పశువులకు గడ్డి బాగా లబి ంచే ప్రాంతాలను పెంచడాన్ని తండాలుగా ఏర్పాటు చేసుకోండి, గిరిజనులు అక్కడే జీవనం సాగించేవారు. గ్రామాలకు దూరంగా అడవులలో నివసించడంతో వాతావరణం లో మార్పు వచ్చినప్పుడు అల్లా పశువులు రోగాన్న బారిన పడేవి, వర్షాకాలం



మొదలు కాగానే తండాలోని పశువులు వందల సంఖ్యలో మరణించేవి, జ్వరం, వీరేశనాలు, కాలు డెక్కలు చెడిపోయాయి, నోరు చెడిపోయి మేత తినకపోవడం, వంటి లక్షణాలతో పశువులు ప్రాణాలు కోల్పోయేవి, ఈ జబ్బులను గిరిజనుల అప్పట్లో లాళి గాలిగుంట వ్యాధిగా పిలిచేవారు.గిరిజన కలలోకి సిత్లా మాత,పశువు సంపద మరణిస్తూ బాధపడుతున్న తరుణంలో, పూర్వం గిరిజన పెద్ద కలలోకి వచ్చి గిరిజన ఏడుగురు దేవతల లో చిన్నదైన సిత్లా దేవత కనిపించి తనను పూజిస్తే పశు సంపద దక్కుతుందని చెప్పడంతో అప్పటినుంచి గిరిజన తండాల్లో ఆనాయితీగా పండుగను జరుపుకుంటున్నారు.హిందూ దేవతల సప్త మాటలు సిత్లా దేవతలుపశువు సంపద రక్షణ కోసం గోర్ బంజారా లు ఏడుగురు దేవతలైన,1. మేరామా, 2. తోల్జ, 3. మంత్రాల్ ,4. లంకిని(డోలంగట్ భవాని),5. హింగ్లా,6. కేం కాళి, 7. ,సిత్లా మాతలను పూజిస్తారు. వీరితోపాటు రక్షణగా ఉండే లుంకిడియాను సైతం ప్రేమతో పూజిస్తారు. సత్తా మా ంత్రి కులైన బ్రాహ్మణి ,మహేశ్వరి, కౌమరి, వైష్ణవి, పారాయి, నరసింహ హంద్రెడ్లను చేతుల దేవత పోలి ఉండటం విశేషం,

వర్షాకాల ప్రారంభంలో పునర్వాను పెద్దపుసాలా కార్తిలో ఏదైనా ఒక మంగళవారం సిత్లా మాతను గిరిజనులు కొలుస్తారు, అన్ని పండగల ఇండ్లలో కాకుండా తండాకు దగ్గర్లోని చెరువు ఒడ్డున ఈ పూజ చేస్తారు. పొద దాటి రాళ్లతో తయారుచేసిన 7 ప్రతిమలను ఒకే వరుసల్లో ప్రతిష్టించి, ఏడుగురు గా 100 అడుగుల దూరంలో లుంకిడియా ప్రతి భాను ఏర్పాటు చేస్తారు. వాంసిం డో కన్నెపిల్లలు విచ్చే నైవేద్యం, పూలు మామిడి ఆకులతో అలంకరిస్తారు. ఒకరోజు ముందే జొన్నలు పప్పు ధాన్యాలు నానపెట్టిన ధాన్యాలతో (గుగ్గిళ్ళుగా )తయారుచేసినా సామాగ్రిని గుగ్గిళ్ళను మన ఇంట్లో నిత్యం వాడుకునే ఎండుమిర్చి, చింతపండులను, ఉల్లిగడ్డలు, పాయసం, మొదలగునవి, నైవేద్యంగా సమర్పిస్తారు. దీనిని గిరిజనులు దీనిని గిరిజనులు వాంసిం డో ప్రాచీన వైద్యంగా చెబుతారు.వాంసిండో ను కన్నెపిల్లలు సిత్లా భవాని గా సమర్పించడం ఆనవాయితీగా, యువత మేల తాళలతో నృత్యాలు చేస్తూ, గొర్రెపోతులను, మేకలను, కోళ్లను, బలిస్తూ, వాటి పేగులను దేవతల ప్రతిమల నుంచి లుంకీడియా ప్రతిమ వరకు పరుస్తారు. వాటి మీద నుంచి గిరిజనుల పశువులను దాటిస్తారు, ఆ మధ్యలో ఓ వ్యక్తి గూగ్గిళ్ళను పశువుల పైన చల్లుతారు. ఇలా దీనిని దాటుతూ పండుగగా పరిగణిస్తారు.సిత్లా తెలుగు రాష్ట్రాల్లో ఒకేరోజు జరుపుకోవాలని నిర్ణయం.నగర బేరి లంబాడి హక్కుల పోరాట సమితి, లంబడిల అన్ని సంఘాలు పిలుపునిస్తోంది.

# టీ20తో గ్లోబల్ స్పోర్ట్స్‌గా క్రికెట్

న్డే ఇంటర్నేషనల్ క్రికెట్ యొక్క దీర్ఘకాలిక భవిష్యత్తుపై భారత స్పిన్ దిగ్గజం రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర సందేహాలు వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించడానికి కేవలం టీ20 ఫార్మాట్ మాత్రమే అత్యంత అనుకూలమైనదని ఆయన అభిప్రాయపడ్డారు. తక్కువ సమయంలో ముగిసే మ్యాచ్‌లను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు ఎక్కువగా ఇష్టపడతారని, క్రికెట్‌ను ఒక గ్లోబల్ స్పోర్ట్స్‌గా మార్చాలనే ఐసీసీ ఆశయాలకు ఈ ఫార్మాట్ ఎంతో కీలకమని అశ్విన్ పేర్కొన్నారు. క్రికెట్ చరిత్రలోనే ఒక కీలకమైన మలుపు తిరుగుతున్న తరుణంలో అశ్విన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దాదాపు 128 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ మళ్లీ రీ-ఎంట్రీ ఇవ్వబోతోంది. చివరిగా 1900 పారిస్ ఒలింపిక్స్‌లో మాత్రమే క్రికెట్ పోటీలు జరిగాయి. వీటికి సంబంధించిన అర్హత ప్రమాణాలను కూడా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఇటీవల అధికారికంగా ప్రకటించింది. వార్తా సంస్థ పీటీఐ నివేదిక ప్రకారం అశ్విన్ మాట్లాడుతూ.. "మరో రెండు సంవత్సరాలలో ఒలింపిక్స్ జరగబోతోంది. క్రికెట్‌ను ప్రపంచ స్థాయి క్రీడగా మార్చడంలో ఐసీసీ నిజంగానే సీరియస్‌గా ఉంటే, ప్రస్తుతం నడుస్తున్న వివిధ టీ20 లీగ్‌లలోని జట్లు ఈ విస్తరణలో చాలా కీలక పాత్ర పోషిస్తాయి" అని అన్నారు. అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్ లో 'సాన్ ఫ్రాన్సిస్కో యూనికార్న్స్' జట్టు తరఫున ఆడుతున్న అశ్విన్, ప్రపంచవ్యాప్తంగా ఫ్రాంచైజీ టీ20 లీగ్‌ల వేగవంతమైన వృద్ధి మరియు ఒలింపిక్స్‌లో క్రికెట్ చేరడం వల్ల ఈ క్రీడకు ఆటగాళ్లు మరియు అభిమానుల సంఖ్య విపరీతంగా పెరుగుతుందని విశ్వసిస్తున్నారు. అదే సమయంలో 50 ఓవర్ల ఫార్మాట్ ఉనికిపై ఆయన నేరుగా ప్రశ్నలు లేవనెత్తారు. "క్రికెట్ మరింత పెద్దగా విస్తరించాలంటే ఇదే సరైన మార్గం. దీనివల్ల



వివిధ దేశాల నుంచి ఎక్కువ మంది ప్రతిభావంతులైన ఆటగాళ్లు వెలుగులోకి వస్తారు. ఏడాది పొడవునా జరిగే లీగ్‌లకు కూడా ఇది చాలా అవసరం. క్రీడగా టీ20 ఫార్మాట్ ఎప్పటికీ నిలిచిపోతుంది. కానీ, వన్డే క్రికెట్ భవిష్యత్తు ఎంతవరకు ఉంటుందో నాకైతే ఖచ్చితంగా తెలియడం లేదు" అని అశ్విన్ నిర్మొహమాటంగా చెప్పారు. వన్డే క్రికెట్ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేసిన మొదటి దిగ్గజం అశ్విన్ మాత్రమే కాదు. ఒకవైపు సంప్రదాయ టెస్ట్ క్రికెట్‌కు ఉన్న ఆదరణ, మరోవైపు టీ20 లీగ్‌లకు ఉన్న కమర్షియల్ సక్సెస్ (ఆర్థిక లాభాలు) మధ్య వన్డే ఫార్మాట్ ప్రస్తుతం నలిగిపోతోంది. ఐసీసీ టోర్నమెంట్లు మినహా, రెండు దేశాల మధ్య జరిగే ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లకు ఆదరణ భారీగా తగ్గుతోంది. ఇదే విషయమై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఇయాన్ చాపెల్ సైతం గతంలో ఆందోళన వ్యక్తం చేశారు. క్రికెట్ బోర్డుల నిర్వాహకులు తీసుకుంటున్న స్వల్పకాలిక నిర్ణయాలు, టీ20ల ద్వారా వచ్చే ఆర్థిక లాభాలపై చూపిస్తున్న వ్యామోహం వల్లే వన్డేల ప్రజాదరణ తగ్గిపోయిందని, ఈ ఫార్మాట్ కేవలం వరల్డ్ కప్ సమయానికే పరిమితమయ్యేలా మార్చేశారని చాపెల్ విమర్శించారు.

# 36 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టిన ఉనై సైమన్

ఫిఫా ప్రపంచ కప్ 2026 లో స్పెయిన్ జట్టు తన విజయ పరంపరను కొనసాగిస్తూ ఘనంగా ప్రీక్వార్టర్స్‌కు చేరుకుంది. టోర్నమెంట్‌లో భాగంగా జరిగిన రౌండ్-32 పోరులో స్పెయిన్ ఏకపక్షంగా ఆస్ట్రియాను 3-0 తేడాతో చిత్తు చేసింది. మ్యాచ్‌లో స్పెయిన్ స్టార్ ప్లేయర్ మైకెల్ 36వ, 89వ నిమిషాల్లో రెండు అద్భుతమైన గోల్స్ సాధించగా, పెడ్రో పోర్రో 66వ నిమిషంలో మరో గోల్ కొట్టి జట్టుకు భారీ విజయాన్ని ఖాయం చేశాడు. ఈ విజయంతో పాటు స్పెయిన్ గోల్ కీపర్ ఉనై సైమన్ ఫుట్‌బాల్ చరిత్రలో ఒక అరుదైన ఘనతను సొంతం చేసుకుని, 36 ఏళ్లనాటి సుదీర్ఘ రికార్డును బద్దలు కొట్టాడు. ప్రపంచకప్ బరిలో ప్రత్యర్థులకు సింహస్వప్నంగా మారిన ఉనై సైమన్, ఏకంగా 519 నిమిషాల పాటు ప్రత్యర్థులను ఒక్క గోల్ కూడా చేయనీయకుండా అడ్డుకుని సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. దీనితో 1990 వరల్డ్ కప్‌లో ఇటలీ లెజెండరీ ప్లేయర్ వాల్టెర్ జెంగా నెలకొల్పిన 517 నిమిషాల నాటి క్లీన్-షీట్ ఘనతను సైమన్ అధిగమించాడు. గత ప్రపంచ కప్ నుంచి ఈ స్పెయిన్ గోల్ కీపర్ అద్భుత ఆటతీరుకు తిరుగులేకుండా పోయింది. చివరిగా 2022 ప్రపంచ కప్ గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో జపాన్ జట్టు స్పెయిన్‌పై 51వ నిమిషంలో గోల్ చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు జరిగిన ఏ మ్యాచ్‌లోనూ స్పెయిన్ నెట్‌లోకి బంతిని పంపడం ప్రత్యర్థులకు సాధ్యం కాలేదు. ఈసారి లీగ్ స్టేజ్‌లో ఆడిన మూడు మ్యాచుల్లో రెండు విజయాలు, ఒక డ్రాతో గ్రూప్ ఎ లో అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్న స్పెయిన్.. ఇప్పుడు నాకౌట్ మ్యాచ్‌లోనూ ఆస్ట్రియాను గోల్ కొట్టనీయకుండా ఉనై సైమన్ అడ్డుకోవడంతో అప్రతిహతంగా దూసుకుపోతోంది. ప్రీక్వార్టర్స్‌లో (రౌండ్-ఆఫ్-



16) స్పెయిన్ జట్టు తదుపరి పోరులో క్రిస్టియానో రొనాల్డో నాయకత్వంలోని బలమైన పోర్చుగల్ జట్టుతో తలపడనుంది. ఫిఫా వరల్డ్ కప్ 2026 నాకౌట్ పోరులో అభిమానులను ఉత్కంఠతలూగించే హై-డ్రామా మ్యాచ్ చోటుచేసుకుంది. స్టార్ స్ట్రైకర్ క్రిస్టియానో రొనాల్డో, యువ సంచలనం గొంకాలో రామోస్ అద్భుత గోల్స్‌తో పోర్చుగల్ జట్టు 2-1 తేడాతో బలమైన క్రొయేషియాను మట్టికరిపించింది. హోరాహోరీగా సాగిన ఈ రౌండ్-ఆఫ్-32 పోరులో విజయం సాధించడం ద్వారా పోర్చుగల్ ప్రిక్వార్టర్స్ (రౌండ్-ఆఫ్-16) కు దూసుకెళ్లింది.

# రొనాల్డో ప్రపంచ రికార్డ్ నమోదు

పోర్చుగల్ సాకర్ దిగ్గజం 41ఏళ్ల క్రిస్టియానో రొనాల్డో నయా హిస్టరీ క్రియేట్ చేశాడు. 2026 ఫిఫా ప్రపంచ కప్ 'రౌండ్ ఆఫ్ 32'లో క్రొయేషియాతో జరిగిన మ్యాచ్‌లో పోర్చుగల్ 2-1 తేడాతో విజయం సాధించింది. ఈ క్రమంలోనే రొనాల్డో ఫిఫా టోర్నమెంట్ చరిత్రలో కీలక రికార్డును కూడా నెలకొల్పాడు. టొరంటో వేదికగా శుక్రవారం తెల్లవారుజామున పోర్చుగల్ - క్రొయేషియా మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగడంతోనే రొనాల్డో అరుదైన ఘనత సాధించాడు. ఫిఫా చరిత్రలో నాకౌట్ మ్యాచ్ ఆడిన అత్యంత పెద్ద వయస్కుడిగా రికార్డు కొట్టాడు. నేటికి రొనాల్డో వయసు 41ఏళ్ల 147 రోజులు. అంతేకాకుండా ఈ మ్యాచ్‌లో అతడు ఓ గోల్ సాధించాడు. సెకండ్ హాఫ్‌లో 68వ నిమిషంలో పెనాల్టీ కిక్ ద్వారా రొనాల్డో గోల్ కొట్టాడు. దీంతో ఫిఫా హిస్టరీలో నాకౌట్ మ్యాచ్‌ల్లో గోల్ సాధించిన అత్యంత పెద్ద వయస్కుడిగానూ రొనాల్డో సరికొత్త రికార్డు నెలకొల్పాడు. అంతకుముందు ఈ రికార్డు పోర్చుగల్ ఆటగాడు పేపే పైన ఉంది. అతడు 39ఏళ్ల 283 రోజుల వయసులో 2022 ప్రపంచకప్‌లో స్విట్జర్లాండ్‌పై గోల్ చేశాడు. దీంతో ఈ మ్యాచ్‌కు ముందు పేపే పైనే ఈ రికార్డు కొనసాగుతూ వచ్చింది. తాజాగా దాన్ని రొనాల్డో బ్రేక్ చేశాడు. అయితే ఓవరాల్‌గా ఫిఫా ప్రపంచ కప్ చరిత్రలో గోల్ చేసిన అత్యంత పెద్ద వయస్కుడిగా మాత్రం రోజర్ మిలా (కామెరూనియన్) కొనసాగుతున్నారు. అతడు 42ఏళ్ల 39 రోజుల వయస్సులో 1994 ఫిఫా ప్రపంచ



కప్‌లో రష్యాపై గోల్ కొట్టాడు. ఫిఫా ప్రపంచ కప్ నాకౌట్ మ్యాచ్‌లో గోల్ సాధించడం రొనాల్డోకు ఇదే తొలిసారి కావడం విశేషం. అతడు అంతకుముందు ఫిఫాలో అనేక గోల్స్ చేసినా, కీలకమైన నాకౌట్ మ్యాచ్‌ల్లో మాత్రం గోల్ కొట్టలేదు. తాజా మ్యాచ్‌తో రొనాల్డో కెరీర్‌లో ఆ లోటు కూడా తీరిపోయింది. ఇక ప్రస్తుత వరల్డ్‌కప్‌లో రొనాల్డోకు ఇది మూడో గోల్. గ్రూప్ స్టేజ్‌లో అతడు ఉజ్బెకిస్థాన్‌పై రెండు గోల్స్ చేశాడు. అలాగే ఓవరాల్‌గా ఫిఫాలో రొనాల్డోకు ఇది 15వ గోల్. కెరీర్ చివరిదశలో ఉన్న రొనాల్డో ఈ వరల్డ్‌కప్ ముగిసేలోపే రిటైర్మెంట్ ఇచ్చేస్తాడని ప్రచారం మొదలైంది. పైగా దీనిపై తన నిర్ణయాన్ని ఈ వరల్డ్‌కప్‌లోనే ప్రకటిస్తాడని రొనాల్డో సోదరి ఈ మ్యాచ్‌కు ముందు సోషల్ మీడియాలో ఓ పోస్టు షేర్ చేసింది. దీంతో అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. అయితే మ్యాచ్ ముగిసిన తర్వాత రొనాల్డో ఈ ప్రచారంపై స్పందించాడు. తొందరపడి ఎప్పుడూ తాను నిర్ణయాలు తీసుకోనని స్పష్టం చేశాడు. 'నేను తొందరపడి ఏ నిర్ణయం తీసుకోను. ఏ విషయంలోనైనా ఈ వరల్డ్‌కప్ ముగిసిన తర్వాతే నిర్ణయం తీసుకుంటా' అని రొనాల్డో రిటైర్మెంట్‌పై క్లారిటీ ఇచ్చాడు. కాగా, తాజా విజయంతో పోర్చుగల్ రౌండ్ ఆఫ్ 16 (ప్రీ క్వార్టర్స్) కు అర్హత సాధించింది. ఇక ప్రీ క్వార్టర్స్‌లో ఆ జట్టు స్పెయిన్ ఢీ కొట్టాల్సి ఉంది. ఈ మ్యాచ్ జులై 07న జరగనుంది. ఇక మ్యాచ్ విషయానికొస్తే, తొలి అర్ధభాగంలో ఏ జట్టు కూడా గోల్ కొట్టలేదు. కానీ అద్భుతమై ఆటతో క్రొయేషియా ఆకట్టుకుంది. రెండో అర్ధభాగం ప్రారంభంలోనే ఇవాన్ పెరిసిచ్ కొట్టిన గోల్‌తో క్రొయేషియా ఆధిక్యంలోకి వచ్చింది. ఆ తర్వాత 68వ నిమిషంలో పెనాల్టీ ద్వారా రొనాల్డో గోల్ సాధించి, స్కోరును సమం చేశాడు. అదనపు సమయంలోని 94వ నిమిషంలో గొంజలో రామోస్ గోల్ సాధించి పోర్చుగల్‌ను విజేతగా నిలిపాడు.

# వైభవ్ ఇంకా వెయిట్ చేయించడం ఎందుకు..?

● సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్



ప్రపంచ క్రికెట్‌లో ప్రస్తుతం టీమిండియా యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ హాట్ టాపిక్‌గా మారిపోయాడు. ఐపీఎల్ 2026లో పరుగుల వరద పారించి.. హేమాహేమీ ప్లేయర్లను సైతం వెనక్కి నెట్టి ఆరెంజ్ క్యాప్ దక్కించుకున్న ఈ బుడ్డోడు.. ఇటీవల ముక్కోణపు సిరీస్‌లోనూ సత్తాచాటాడు. ఇదే జోరులో టీమిండియా టీ20 జట్టు నుంచి పిలుపు అందుకున్నాడు. అయితే జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ.. అతడికి ప్లేయింగ్ లెవెన్‌లో ఆడే అవకాశం రావట్లేదు. ఇటీవల ఐర్లాండ్‌తో ముగిసిన రెండు టీ20లు, ఇంగ్లాండ్‌తో తొలి టీ20లోనూ అతడు బెంచ్‌పైనే కూర్చున్నాడు. ఇదే విషయంపై సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్ మాట్లాడాడు. ముఖ్యంగా అందరు ఆటగాళ్ల మాదిరిగానే అరంగేట్రం విషయంలో వైభవ్ సూర్యవంశీ కూడా వెయిట్ చేయాల్సి ఉంటుందని ఇటీవల టీమిండియా అసిస్టెంట్ కోచ్ డస్కటే చేసిన వ్యాఖ్యలను డివిలియర్స్ వ్యతిరేకించాడు. ప్రస్తుతం అతడి ప్రదర్శన చూశాక.. ఇంకా వెయిట్ చేయించడం ఎందుకని ప్రశ్నించాడు. "వైభవ్ సూర్యవంశీని ఎప్పుడు భారత తుది జట్టులోకి తీసుకుంటారు ఐర్లాండ్‌తో సిరీస్ అతడికి మంచి అవకాశంగా ఉండేది. కానీ అతడిని ఆ సిరీస్‌లో ఆడించలేదు. ఇది దురదృష్టకరం. సూర్యవంశీ కూడా ఇతర ఆటగాళ్ల మాదిరిగానే అరంగేట్ర ప్రక్రియను అనుసరించాల్సిందేనన్న భారత కోచ్‌తో నేను విభేదిస్తున్నాను. ఐపీఎల్‌లో అతడి ఆటను చూశాక.. ఇంకా అతడిని వెయిట్ చేయించడం ఎందుకు వైభవ్‌ను ఐర్లాండ్‌పై ఆడిస్తే బాగుండేది. కాస్త అనుభవం కూడా వచ్చేది కదా" అని ఏబీ డివిలియర్స్ వ్యాఖ్యానించాడు. మరోవైపు టీమిండియా ఓపెనర్ సంజూ శాంసన్ ఇటీవల దారుణంగా విఫలం అవుతున్నాడు. ఐర్లాండ్‌తో 2 మ్యాచ్‌లు, ఇంగ్లాండ్‌తో తొలి టీ20లో సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరిపోయాడు. దీంతో అతడి ప్లేసులో వైభవ్‌కు రెండో టీ20లో చోటు ఇవ్వాలనే డిమాండ్‌లు పెరిగిపోయాయి. అయితే మరికొందరు మాత్రం.. సీనియర్లను తప్పించి కుర్రాడిని ఇప్పుడే ఆడించొద్దని సూచిస్తున్నారు. మరి రెండో టీ20లో అతడికి చోటు ఉంటుందా.. మరోసారి బెంచ్‌కే పరిమితం కావాల్సి వస్తుందా అనేది తేలాల్సి ఉంది.

# మెదక్‌పై నల్గొండ ఘన విజయం

నురాగ్ నల్గొండ నైట్స్ గెలుపు ట్రాక్ ఎక్కింది. గత మ్యాచ్‌లో ఖమ్మం చేతిలో ఓడిన నల్గొండ, తాజాగా మెదక్‌ను చిత్తు చేసింది. ఉప్పల్ వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో మెదక్‌పై నల్గొండ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మెదక్ నిర్దేశించిన 181 పరుగుల టార్గెట్‌ను నల్గొండ 16.3 ఓవర్లలోనే ఛేదించింది. ఓపెనర్ గౌరవ్ రెడ్డి (101 నాటౌట్) సెంచరీతో ఆకట్టుకున్నాడు. జశ్వంత్ మోతె (34 పరుగులు) ఫర్వాలేదనిపించాడు. మెదక్ బౌలర్లలో అర్జున్, మధుకర్ చెరో 1 వికెట్ పడగొట్టారు. ఓ మోస్తారు ఛేదనను నల్గొండ ఘనంగానే ఆరంభించింది. గౌరవ్ రెడ్డి తొలి నుంచే దూకుడుగా ఆడడంతో పవర్ ప్లేలోనే భారీగా పరుగులు వచ్చాయి. జస్వంత్ కూడా ఆకట్టుకున్నాడు ఈ ఇద్దరు తొలి వికెట్‌కు 40 బంతుల్లోనే 83 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. 6.4 ఓవర్ వద్ద జస్వంత్ ఔట్ అయ్యాడు. అయినా గౌరవ్ జోరు తగ్గలేదు. బౌండరీలు బాదుతూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. వన్ డౌన్‌లో వచ్చిన నితీశ్ (21) స్వల్ప స్కోరుకే మధుకర్ బౌలింగ్‌లో 12.2 వద్ద ఔటయ్యాడు. కానీ అప్పటికే నల్గొండ గెలుపు ఖాయమైంది. చివర్లో సెంచరీతోపాటు గౌరవ్ మ్యాచ్‌ను కూడా ముగించాడు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన మెదక్ ఫాల్కన్స్ 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. విక్రమ్ నాయక్ (48 పరుగులు నాటౌట్), వరుణ్ ఎర్రమ్ (44 పరుగులు) రాణించారు. శ్రుంజిత్ రెడ్డి



(30 పరుగులు), తెలుకుపల్లి రవితేజ (33 పరుగులు) ఫర్వాలేదనిపించారు. నల్గొండ బౌలర్లలో ఇయాన్ సతాని, చింతల రక్షన్ రెడ్డి, అనికేత్ రెడ్డి తలో 1 వికెట్ దక్కించుకున్నారు. తాజా ఓటమితో మెదక్ టీజీ 20 లీగ్ ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది! ఇప్పటిదాకా ఆరు మ్యాచ్‌లు ఆడిన ఆ జట్టు కేవలం ఒకే దాంట్లో నెగ్గింది. మిగిలిన ఐదు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయి పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉంది. మరోవైపు, నల్గొండ నాలుగో విజయంతో రెండో స్థానంలోకి దూసుకెళ్లింది. ఇప్పటిదాకా ఆరు మ్యాచ్‌లు ఆడిన నల్గొండ రెండు ఓటములు, నాలుగు విజయాలు 8 పాయింట్లతో ప్లేఆఫ్స్‌కు దగ్గరైంది. ఇక ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ 10 పాయింట్లతో టాప్‌లో ఉంది.

# సంజూ శాంసన్ తీవ్రమైన ఒత్తిడి



ఇండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ ప్రెజెంట్ కెరీర్ లోనే మోస్ట్ డిఫికల్ట్ ఫేజ్ ను ఫేస్ చేస్తున్నాడు. టీమిండియా మేనేజ్‌మెంట్ అతనిపై నమ్మకం ఉంచినప్పటికీ, బయట నుంచి వస్తున్న విమర్శలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. లాస్ట్ మూడు ఇన్నింగ్స్‌లలో 5, 0, 1 రన్స్ మాత్రమే చేసి దారుణంగా ఫెయిల్ అవ్వడం శాంసన్ పొజిషన్ ను రిస్క్ లో పడేసింది. ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్ లతో పాటు ఇంగ్లాండ్‌తో జరిగిన ఫస్ట్ టీ20 మ్యాచ్ లోనూ అతను పూర్తిగా నిరాశపరిచాడు. ఇదే టైమ్‌లో 15 ఏళ్ల బ్యాటింగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ ప్లేయింగ్ ఎలెవన్ లో ఛాన్స్ కోసం వెయిట్ చేస్తుండటంతో శాంసన్ పై ప్రెజర్ నెక్స్ట్ లెవెల్ కు చేరింది. ఈ నేపథ్యంలో ఇండియా మాజీ లు సంజూ శాంసన్ బ్యాటింగ్ లో ఉన్న ఒక మేజర్ టెక్నికల్ లోపాన్ని ఎక్స్ పోజ్ చేశారు. సంజూ శాంసన్ ను అవుట్ చేయడానికి బౌలర్లు ఎలాంటి ప్లాన్ ఫాలో అవుతున్నారో నిపుణులు క్లియర్ గా ఎక్స్ ప్లెయిన్ చేస్తున్నారు. సంజూ బ్యాటింగ్ చేసేటప్పుడు అతని బ్యాట్ ఫేస్ కంప్లీట్‌గా క్లోజ్ అయి ఉంటుందని, అందుకే బౌలర్లు బాల్ ను ఆఫ్ స్టంప్ కు వెలుపల వేయడానికి ట్రై చేస్తున్నారని అంటున్నారు. క్లోజ్డ్ బ్యాట్ ఫేస్ తో ఉన్నప్పుడు అతను ఆఫ్ సైడ్ షాట్లు ఆడటానికి ప్రయత్నించినప్పుడు బ్యాట్ ఫేస్ ఒక్కసారిగా ఓపెన్ అవుతుందని, ఈ టెక్నికల్ ఫ్లా వల్లే అతను వికెట్లు పారేసుకుంటున్నాడని మాజీ ఆల్ రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ స్పష్టం చేశాడు. ఐర్లాండ్ తో జరిగిన ఫస్ట్ మ్యాచ్ లో బాల్ ను ఆన్ ది అప్ ఆడబోయి ఇన్‌సైడ్ ఎడ్జ్ తో క్లీన్ బౌల్డ్ అయ్యాడని, ఇంగ్లాండ్ పై జరిగిన మ్యాచ్ లోనూ ఆఫ్ స్టంప్ అవతలి బాల్ ను అనవసరంగా కెలుక్కుని థర్డ్ మ్యాన్ లో క్యాచ్ ఇచ్చాడని పఠాన్ విశ్లేషించాడు. మరో ఎండ్ లో బిహార్ కు చెందిన 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ ఇంటర్నేషనల్ డెబ్యూ కోసం క్రికెట్ లోకమంతా ఈగర్‌గా వెయిట్ చేస్తోంది.

# నాగబంధం గ్రాఫిక్స్ హైలెట్

## కథా కథనంలో కనిపించని పట్టు

సినిమా నిర్మాణ దశ నుంచే తెలుగు ఆడియెన్స్‌లో ఎంతో ఆసక్తిని రేకెత్తించిన చిత్రం నాగబంధం. భారీ గ్రాఫిక్ హంగులతో విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. డివైన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ హీరోగా నటించగా, అభిషేక్ నామా దర్శకత్వం వహించారు. భారీ అంచనాలతో ఈ సినిమా శుక్రవారం విడుదలై ప్రేక్షకులను మెప్పించింది. అనాథ అయిన రుద్ర (విరాట్ కర్ణ)ను పద్మమ్మ (శరణ్య) చేరదీసి సొంత కొడుకులా పెంచుతుంది. తన చెల్లెలి (సోనియా సింగ్) పెళ్లిని రాజు అనే యువకుడితో ఘనంగా చేయాలని రుద్ర అనుకుంటాడు. సరిగ్గా పెళ్లి సమయంలో రంగనాథ స్వామి ఆలయంలోని బ్రహ్మకమలం కోసం రుద్ర కుటుంబంపై జుల్ఫికర్ అలీ (రిషబ్) దాడి చేస్తాడు. ఈ ప్రమాదంలో రుద్ర ఫ్యామిలీలోని అందరూ చనిపోతారు. వేల ఏళ్లుగా రంగనాథ స్వామి ఆలయంలో పూజలందుకుంటున్న బ్రహ్మకమలంతో రుద్రకు ఉన్న సంబంధం ఏమిటి? ఆ బ్రహ్మకమలాన్ని దొంగతనం చేయాలని ఆర్కియాలజిస్ట్ ప్రభాకర్ (జగపతిబాబు)తో పాటు అతని కూతురు పార్వతి (నభా నటేష్) ఎలాంటి ప్రయత్నాలు చేశారు? ఆలయంలోని బ్రహ్మకమలం, గరుడ మంత్రాలతో పాటు నాగబంధం గ్రంథం సాయంతో అమరత్వం పొందాలని జుల్ఫికర్ అలీ, భైరాగి (గరుడ రామ్) ఎలాంటి మారణహోమానికి పాల్పడ్డారు? కైలాస పర్వతంలోని విరాటస్వామి ఆలయంలోని ఓ గదిలో ఉన్న రహస్యం ఏమిటి? 17వ శతాబ్దంలో హిందూ దేవాలయాలను దోచుకున్న అబ్దాలీని నాగసాధువు ఎలా నిలువరించాడు? అన్నదే నాగబంధం మూవీ కథ. కేరళలోని అనంత పద్మనాభ స్వామి ఆలయానికి నాగబంధం రక్షణగా ఉందనే కథ ప్రచారంలో ఉంది. ఆ నాగబంధాన్ని విచ్ఛిన్నం చేయాలంటే గరుడ మంత్రాలు తెలిసి ఉండాలని పురాణాల్లో రాసి ఉంది. ఈ పాయింట్ నుంచే దర్శకుడు అభిషేక్ నామా స్ఫూర్తి పొంది నాగబంధం కథను రాసుకున్నారు. ఈ చిన్న పాయింట్‌కు సనాతన ధర్మం, హైందవ సంస్కృతితో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్, లవ్‌స్టోరీని జోడించి సినిమాను రూపొందించారు. నాగబంధం విముక్తి కోసం ప్రయత్నించే అసాంఘిక శక్తులు, దేవుడి అండతో వారిని ఎదుర్కొనే సామాన్యుడైన హీరో.. ఈ అంశాల చుట్టే నాగబంధం కథ సాగుతుంది. ప్రతి ఫ్రేమ్ కలర్‌ఫుల్‌గా ఉంటుంది.




అబ్బురపరిచే సెట్స్, అదిరిపోయే గ్రాఫిక్స్ లార్జర్ దేన్ లైఫ్‌లాంటి అనుభూతిని అందిస్తాయి. యాక్షన్ ఎపిసోడ్స్ బాగున్నాయి. భైరవకోన ఎపిసోడ్, మానసాదేవి టెంపుల్‌లో జరిగే ఫైట్‌తో పాటు అబ్దాలీ మనుషులకు, నాగసాధువులకు మధ్య జరిగే వార్ సీన్లు గూస్‌బంప్స్ కలిగిస్తాయి. అయితే యాక్షన్ సీక్వెన్స్‌లు సుదీర్ఘంగా సాగడం మాత్రం సినిమాకు మైనస్‌గా మారింది. నాగబంధం కథను మొదలుపెట్టిన తీరు బాగుంది. ఫ్యామిలీ సీన్లు కథకు పెద్దగా అతకలేదు. కథ మొత్తం బ్రహ్మకమలం చుట్టే తిరగడంతో సాగదీసిన ఫీలింగ్ కలుగుతుంది. రెండు డిఫరెంట్ షేడ్స్‌తో సాగే పాత్రలో హీరోగా విరాట్ కర్ణ మెప్పించాడు. నాగసాధువుగా అతని లుక్ బాగుంది. యాక్షన్ సన్నివేశాల్లో మెప్పించినా, ఎమోషనల్ సీన్ల పరంగా ఇంకా పరిణితి చూపించాల్సి ఉంది. నభా నటేష్‌కు మంచి రోల్ దక్కింది. పాజిటివ్, నెగెటివ్ కోణాల్లో ఆమె పాత్ర సాగుతుంది. కొద్దిసేపు డ్యూయల్ రోల్‌లో కనిపిస్తుంది. విలన్‌గా రిషబ్ డైలాగ్ డెలివరీ, బాడీలాంగ్వేజ్ విభిన్నంగా ఉన్నాయి. మరో హీరోయిన్ ఐశ్వర్య మీనన్‌కు ఒకటి రెండు డైలాగ్స్ తప్ప పెద్దగా ఇంపా÷–టర్గ÷న్స్ లేదు. జగపతిబాబు, మురళీ శర్మ, మహేష్ మంజ్రేకర్, శరణ్య, అనసూయ, సోనియా సింగ్, అంకిత్ కొయ్యతో పాటు సినిమాలో చాలామందే యాక్టర్లు కనిపిస్తారు కానీ, తమ నటనను చాటిచెప్పే అవకాశం ఎవరికీ దక్కలేదు. విజువల్స్, గ్రాఫిక్స్ పై పెట్టిన శ్రద్ధ కథపై కూడా పెట్టి ఉంటే నాగబంధం రిజల్ట్ మరోలా ఉండేది. చిన్న చిన్న లోపాలున్నా నాగబంధం ప్రేక్షకులను కొంతవరకు మెప్పిస్తుంది.

# ఆసక్తికరంగా సాగిన రావు బహదూర్

'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' లాంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన దర్శకుడు వెంకటేశ్ మహా. ఇప్పుడాయన సత్యదేవ్‌తో కలిసి చేసిన ప్రయోగాత్మక చిత్రం 'రావు బహదూర్'. దీనికి మహేశ్‌బాబు స్వయంగా సమర్పకుడిగా వ్యవహరించడం.. ఇందులో సత్యదేవ్ భిన్న గెటప్పుల్లో కనిపించనుండటం.. టీజర్, ట్రైలర్లు ఆసక్తిరేకెత్తించేలా ఉండటంతో ప్రేక్షకుల్లో ఈ సినిమాపై మంచి అంచనాలేర్పడ్డాయి. 1968 – 1991 మధ్య కాలంలో సాగే కథ ఇది. రామప్ప రావు బహదూర్ (సత్యదేవ్) ఓ రాజవంశీకుడు. కాలేయ క్యాన్సర్‌తో పోరాడుతూ జీవిత చరమాంకంలో ఉంటాడు. అతను కొన్ని నెలలకు మించి బతకడని డాక్టర్లు చెప్పినప్పటికీ.. వాళ్ల అంచనాల్ని తలకిందులు చేస్తూ నిక్షేపంగా జీవిస్తుంటాడు. అయితే, తీవ్రమైన మానసిక రుగ్మతలతో సతమతమవుతుంటాడు. ముఖ్యంగా అతన్ని ఓ అనుమానం పెనుభూతంలా పట్టిపీడిస్తుంటుంది. దాన్ని తీరిస్తే చాలు.. సంతోషంగా ప్రాణం వదిలేస్తానని తన మిత్రుడు, వ్యక్తిగత వైద్యుడు ఆచారి (వికాస్ ముప్పాల) దగ్గర మాట తీసుకుంటాడు. మరి అతనికున్న ఆ అనుమానమేంటి? దానివల్ల అతని చుట్టూ ఉన్న వాళ్లని ఎన్ని రకాలుగా ముప్పుతిప్పలు పెట్టాడు? అసలు రామప్ప గతమేంటి? రేణుక (దీపా థామస్)తో ప్రేమ, పెళ్లి ప్రయాణం ఎలా సాగింది? ఆమెకి దూరంగా రామప్ప ఒంటరిగా జీవించడానికి వెనకున్న కారణమేంటి? అన్నది సినిమా కథ. ఇదొక విభిన్నమైన సైకలాజికల్ డ్రామా. జీవిత చరమాంకంలో ఉన్న ఓ రాజవంశీకుడు తనకున్న అనుమానం అనే జబ్బుతో చుట్టూ ఉన్న వాళ్లని సైకలాజికల్‌గా ఆడుకుంటూ తన కోరికని ఎలా నెరవేర్చుకున్నాడన్నది క్లుప్తంగా ఈ చిత్ర కథాంశం. పైకిది ఓ రాజవంశ కథలా కనిపించినా.. అంతర్లీనంగా సమాజంలో తరతరాలుగా గూడుకట్టుకుపోయిన వివక్షాపూరిత వ్యక్తిత్వాల గురించి చర్చిస్తుంది. ప్రధానంగా కుల వ్యవస్థ, రంగు, రక్తసంబంధాలు, వారసత్వ హోదాపై ఉన్న పిచ్చిని ఈ చిత్రం బలంగా ప్రశ్నిస్తుంది. కానీ, ఈ సినిమాతో దర్శకుడు వెంకటేశ్ మహా చెప్పాలనుకున్న విషయం ఆలోచన రేకెత్తించేదే అయినా.. దాన్ని ఆద్యంతం జనరంజకంగా మలచడంలో అక్కడక్కడా తడబడ్డారు. ఓ ఫొటో ఫ్రేమ్ నుంచి బయటకొచ్చిన పిల్లాడిని ఊడలు తరుముకుంటూ రావడం.. తనని తిరిగి సమాధిలో బంధించడం.. కట్ చేస్తే మంచం పట్టిన స్థితిలో వృద్ధ పాత్రలో హీరోని పరిచయం చేయడం.. ఇలా




ఆరంభ సన్నివేశాలు ఏదో కొత్త కథని, కొత్త ప్రపంచాన్ని చూడబోతున్నామన్న ఆసక్తిని కలిగించేలా చేస్తాయి. కానీ, సినిమాలో వేగం కనిపించదు. ప్రేక్షకుడికి అసలు కథేంటన్నది అంతుచిక్కడానికి విరామం వరకు వేచి చూడాల్సి వస్తుంది. భువనాలయ ప్రపంచం.. అందులోని రావు బహదూర్ జీవితం.. అతని గతం.. రేణుకతో ప్రేమాయణం అన్నీ నెమ్మదిగా సాగిపోతుంటాయి. హీరో ఎప్పుడైతే తన అనుమానం తీర్చుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెడతాడో అక్కడి నుంచే కథలో సంఘర్షణ రెట్టింపవుతుంది. ఈ క్రమంలో వచ్చే విరామ సన్నివేశాలు ద్వితీయార్ధంపై ఆసక్తిని పెంచేలా ఉంటాయి. ఇక సెకండాఫ్ మొదలైనప్పటి నుంచి కథ కాస్త గాడిన పడిన అనుభూతి కలుగుతుంది. హీరో గతం.. చిన్న కొడుకుపై వివక్ష చూపించడానికి వెనకున్న కారణం.. దాని చుట్టూ నడిపిన డ్రామా అన్నీ ఆకట్టుకుంటాయి. ఇక ఈ కథలోకి పోలీస్ పాత్ర ఎప్పుడైతే ఎంట్రీ ఇస్తుందో.. అక్కడి నుంచి సినిమా ఇంకాస్త ఆసక్తికరంగా మారుతుంది.



# సమంత నటన అద్భుతం..

## 'మా ఇంటి బంగారం'పై అఖిల్ అక్కినేని ప్రశంసలు

అక్కినేని యువ కథానాయకుడు అఖిల్, టాలీవుడ్‌లో ఇటీవల ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన 'మా ఇంటి బంగారం' చిత్రంపై, అందులో సమంత నటనపై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రస్తుతం తాను హీరోగా నటిస్తున్న 'లెనిన్' సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒకరి విజయాన్ని మరొకరు గౌరవించుకోవడం పట్ల ఇండస్ట్రీ వర్గాలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. తన 'లెనిన్' సినిమా ప్రచార కార్యక్రమాలతో బిజీగా ఉండటం వల్ల 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని ఇంకా పూర్తిగా చూడలేదని అఖిల్ తెలిపారు. అయితే, ఆ సినిమా ట్రైలర్ చూశానని, దాని వైబ్ అద్భుతంగా ఉందని అన్నారు. "ట్రైలర్ చూడగానే ఈ సినిమా కచ్చితంగా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం కలిగింది. ఒక మంచి కోడలు తన అత్తారింటి మనసులు గెలుచుకోవాలనే సున్నితమైన ఫ్యామిలీ పాయింట్‌కు, పవర్‌ఫుల్ యాక్షన్‌ను జోడించి చాలా సహజంగా తెరకెక్కించారు" అని చిత్ర బృందాన్ని మెచ్చుకున్నారు. ముఖ్యంగా ఒక మహిళా ప్రధాన పాత్రతో అంత భారీ స్థాయిలో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించడం గొప్ప విషయమని అఖిల్ కొనియాడారు. ఈ చిత్రంలో సమంత తన పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయిందని ప్రశంసించారు. ఈ సందర్భంగా "కంగ్రాట్స్ సామ్" అంటూ సమంతకు, చిత్ర యూనిట్‌కు ప్రత్యేకంగా తన అభినందనలు తెలియజేశారు. నాగచైతన్యతో విడాకుల తర్వాత కూడా అక్కినేని కుటుంబ సభ్యులతో సమంతకు, ముఖ్యంగా అఖిల్‌తో ఉన్న స్నేహపూర్వక సంబంధం, వృత్తిపరమైన గౌరవం మరోసారి బయటపడింది. ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ముందుకు సాగుతున్న తీరు అందరినీ ఆకట్టుకుంటోంది. ఇక అఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న 'లెనిన్' చిత్రం జులై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# 'గుర్తుకొస్తున్నాయి' సిరీస్‌కు ఐకాన్ స్టార్ అండ..

## నిర్మాతగా మారిన మిత్రుడికి బన్నీ ఎమోషనల్ విషెస్

'బేబీ' చిత్రంతో యువతలో మంచి క్రేజ్ సంపాదించుకున్న విరాజ్ అశ్విన్, యశశ్రీ రావు జంటగా నటించిన వెబ్ సిరీస్ 'గుర్తుకొస్తున్నాయి'. ఫీల్ గుడ్ స్కూల్ డేస్ జ్ఞాపకాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సిరీస్, జులై 3 నుంచి 'ఈటీవీ విన్' ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ సిరీస్‌కు సానుకూల స్పందన వస్తున్న తరుణంలో, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ చిత్ర బృందానికి తన మద్దతు తెలుపుతూ సోషల్ మీడియాలో ఒక ప్రత్యేక పోస్ట్ పెట్టారు. ఇది ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది. ఈ సిరీస్ ద్వారా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శరత్ చంద్ర నాయుడు పూర్తిస్థాయి నిర్మాతగా పరిచయమయ్యారు. గతంలో 'చావు కబురు చల్లగా', 'వినరో భాగ్యము విష్ణు కథ' వంటి చిత్రాలకు పనిచేసిన శరత్‌తో ఉన్న అనుబంధం దృష్ట్యా అల్లు అర్జున్ ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా బన్నీ ఒక ఎమోషనల్ పోస్ట్ చేశారు.

"'గుర్తుకొస్తున్నాయి' సిరీస్ గురించి చాలా అద్భుతమైన విషయాలు వింటున్నాను. నా ప్రియమైన శరత్ చంద్రకు, చిత్ర యూనిట్ మొత్తానికి నా హృదయపూర్వక అభినందనలు. నువ్వు ఒక నిర్మాతగా నీ మొదటి అడుగు వేయడం చూడటం నాకు ప్రత్యేకంగా చాలా సంతోషాన్ని ఇస్తోంది. ఈ అందమైన సిరీస్ ప్రేక్షకుల ప్రేమాభిమానాలు, ప్రశంసలతో పాటు గొప్ప విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. చిత్ర తారాగణానికి, సాంకేతిక నిపుణులందరికీ నా శుభాకాంక్షలు. ఈ సిరీస్‌ను ఈటీవీ విన్‌లో చూడటానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని బన్నీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

వినోద్ గాలి దర్శకత్వం వహించిన ఈ సిరీస్, స్కూల్ రోజుల నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేస్తూ యువతను, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. వెబ్ సిరీస్‌గా వచ్చిన కంటెంట్‌కు అల్లు అర్జున్ వంటి అగ్ర నటుడి నుంచి ప్రశంసలు, మద్దతు లభించడం చిత్ర యూనిట్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. బన్నీ పోస్ట్‌తో ఈ సిరీస్‌పై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి పెరిగింది. ఐకాన్ స్టార్ నుంచి లభించిన ఈ మద్దతుకు చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేస్తోంది







# జయకృష్ణ ఘట్టమనేని 'శ్రీనివాస మంగాపురం' రిలీజ్ డేట్ ఫిక్స్

సూపర్ స్టార్ మహేశ్ బాబు సోదరుడి కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ జూలై 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్నట్లు శుక్రవారం వెల్లడించింది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ హీరోయిన్‌గా నటిస్తూ టాలీవుడ్‌కు పరిచయమవుతోంది. 'RX 100', 'మంగళవారం' వంటి విజయవంతమైన చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తిరుపతి నేపథ్యంలో సాగే ఓ ఇంటెన్స్ లవ్‌స్టోరీగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. స్నేహితులుగా ఉండి ప్రేమికులుగా మారిన వాసుబాబు, మంగల కథ ఇది. వారి ఆనందమయ జీవితంలోకి ఓ ఊహించని సంఘర్షణ ఎదురైనప్పుడు ఏం జరిగిందనేదే కథాంశం. తనదైన శైలిలో యాక్షన్, డ్రామా జోడించి అజయ్ భూపతి ఈ ప్రేమకథను తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది





# ఎఐ సాయంతో డీప్‌ఫేక్ చిత్రాలు

## బాంబే హైకోర్టును ఆశ్రయించిన ప్రీతిజింతా

బాలీవుడ్ ప్రముఖ నటి ప్రీతి జింతా బాంబే హైకోర్టును ఆశ్రయించింది. తన అనుమతి లేకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత వాడి సృష్టించిన డీప్‌ఫేక్ చిత్రాలు, మార్ఫింగ్ చేసిన అసభ్యకర కంటెంట్‌కు వ్యతిరేకంగా ఆమె కోర్టుకు వెళ్లింది. ఈ కంటెంట్‌ను ఇంటర్నెట్ నుండి పూర్తిగా తొలగించేలా అత్యవసర ఆదేశాలు ఇవ్వాలని ఆమె కోర్టును కోరారు. ఇక ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ మాధవ్ జామదార్.. కంటెంట్‌ను వెబ్‌సైట్ల నుండి తొలగించడానికి ఒక సులువైన విధానాన్ని రూపొందించాలని ఇరు పక్షాలకు సూచించింది. కాగా దీనిపై తదుపరి విచారణ జూలై 6న జరగనుంది. ప్రీతి జింతా దాఖలు చేసిన ఈ వ్యాజ్యంలో గూగుల్, మెటా వంటి సోషల్ మీడియా సంస్థలతో పాటు డొమైన్ నేమ్ రిజిస్ట్రార్లను ప్రతివాదులుగా చేర్చారు. నటి తరపు సీనియర్ అడ్వకేట్ వెంకటేష్ ధోండ్ వాదనలు వినిపిస్తూ.. రోజురోజుకూ ఈ డీప్‌ఫేక్స్ నాణ్యత పెరుగుతోందని, అందువల్ల తక్షణమే సదరు లింకులను తొలగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. మరోవైపు గూగుల్, మెటా సంస్థల తరపు న్యాయవాదులు స్పందిస్తూ.. వివాదాస్పద లింకులను తొలగించడానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, అయితే సాధారణ చట్టబద్ధమైన కంటెంట్‌ను ముందస్తుగా పర్యవేక్షించి బ్లాక్ చేయాలనే నిబంధనలు విధించవద్దని కోర్టును అభ్యర్థించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. సాధారణ కంటెంట్‌కు ఇబ్బంది లేకుండా, కేవలం అభ్యంతరకర లింకులను మాత్రమే తొలగించేలా ఒక ప్రాక్టికల్ ప్రోటోకాల్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు.


Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,

Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com